RNI NO: TEL/TEL/2009/28544
తెలంగాణ & ఆంధ్రప్రదేశ్
సంపుటి : 18
సంచిక : 124
Vol : 18
Issue : 124



# పీపుల్స్ డైరీ

సమగ్ర వార్తా దినపత్రిక
విలువలతో కూడిన నిఖార్సయిన జర్నలిజం
Editor : KONDAPARTHI KIRAN
CELL : 9493019044
వరంగల్, శుక్రవారం 10 జూలై 2026
Warangal, Friday 10 July 2026
పేజీలు : 08
వెల రూ : 4-00
Pages : 08
Price : 4-00

WANTED
పీపుల్స్ డైరీ
దినపత్రిక తెలంగాణ & ఏపీలోని వివిధ జిల్లాల్లో పనిచేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
సెంటర్లు
◆ హనుమకొండ ◆ కరీంనగర్
◆ భూపాలపల్లి ◆ పెద్దపల్లి/రామగుండం
◆ జనగామ ◆ మహబూబాబాద్
◆ హైదరాబాద్ ◆ నిజామాబాద్
Cell : 9493019044
9618509859

# మూసీ పునరుజ్జీవానికి అడుగు



2లో

- రూ.7,345 కోట్ల పరిపాలనా అనుమతులు మంజూరు
- మూసీ తీరంలో మారనున్న రూపురేఖలు



# మేలుకో ఫుడ్ సేఫ్టీ...

## మత్తు, కల్తీ కోరల్లో ఓరుగల్లు..

కొండపర్తి కిరణ్ (పీపుల్స్‌డైరీ ప్రత్యేక ప్రతినిధి)

ఒకవైపు నగరంలో యువత మాదక ద్రవ్యాలు, నిషేధిత గుట్కాల మత్తులో చిక్కుకుని భవిష్యత్తును పాడు చేసుకుంటుంటే.. మరోవైపు బాధ్యత వహించాల్సిన యంత్రాంగంలో సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. వరంగల్ కమిషనరేట్ పరిధిలో టాస్క్ ఫోర్స్ పోలీసులు నిరంతరం దాడులు చేస్తూ, లక్షల రూపాయల విలువైన గుట్కా ప్యాకెట్లను, గంజాయిని పట్టుకుంటూ కేసులు నమోదు చేస్తున్నారు. కానీ, క్షేత్రస్థాయిలో శాశ్వత చర్యలు తీసుకోవడంలో, దుకాణాల లైసెన్సులు రద్దు చేయడంలో కీలక పాత్ర పోషించాల్సిన ఫుడ్ సేఫ్టీ (ఆహార భద్రత) అధికారులు మౌనం వహించడంపై ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వరంగల్ నగరంతో పాటు నర్సంపేట, పరకాల, జనగామ తదితర (మిగతా 2లో...)

- చట్టం నిద్రపోతే నేరం మేల్కొంటుంది
- గుట్కా, మాదక ద్రవ్యాల విచ్చలవిడి విక్రయాలు
- యువతను కాపాడుకునేదెలా...?
- కల్తీ ఆహారాలతో ప్రజలు అనారోగ్యం పాలు
- హెూటళ్లు, బేకరీలు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లపై నిఘా ఏది?
- కారం, అల్లం పేస్ట్, మసాలాలు సర్వం కల్తీ మయం
- టాస్క్‌ఫోర్స్ యాక్షన్... ఫుడ్‌సేఫ్టీ నిద్రమత్తు...
- ఈ రెండు శాఖలు సమన్వయంతో ముందుకు సాగాలి









# జీతాల చెల్లింపుపై మంత్రి కీలక ఆదేశాలు

- వైద్య ఆరోగ్యశాఖలో విప్లవాత్మక మార్పు
- కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ సిబ్బందికి 1వ తేదీనే వేతనాలు
- మంత్రి దామోదర ఆదేశాలు

పీపుల్స్‌డైరీ–హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ పరిధిలోని వివిధ ప్రభుత్వ ఆసుపత్రులు, వైద్య కళాశాలలు, అనుబంధ విభాగాలలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు సిబ్బంది దీర్ఘకాలిక సమస్యకు ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపింది. క్షేత్రస్థాయిలో అత్యంత కీలకమైన శానిటేషన్, సెక్యూరిటీ, పేషెంట్ కేర్ విభాగాలలో విధులను నిర్వహిస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రతి నెల మొదటి తేదీనే వేతనాలు విడుదల చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఉద్యోగ సంఘాల నుంచి వచ్చిన విజ్ఞప్తిపై రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సానుకూలంగా స్పందిస్తూ తక్షణ చర్యలకు ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సాధారణ (మిగతా 2లో...)

# ఆగస్టు 15లోపు బకాయిలు చెల్లిస్తాం

పీపుల్స్‌డైరీ–హైదరాబాద్ : ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపు పై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వీటి చెల్లింపు కు ముహూర్తం ఖరారు చేసింది. ఈ ఏడాది కలిపి మొత్తం చెల్లింపు దిశగా కసరత్తు చేస్తున్నట్లు వెల్లడించింది. ఇప్పటికే ఫీజు రీయంబర్స్ మెంట్ బకాయిల కోసం నిరసనలు రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్నాయి. ఈ సమయంలో వీటి చెల్లింపు పైన హైకోర్టుకు తెలంగాణ ప్రభుత్వం నిర్దేశించిన గడువు లోగా చెల్లిస్తామని స్పష్టం చేసింది. తెలంగాణలో ఫీజు రీయంబర్స్ మెంట్ బకాయిలు ఈ ఏడాదికి కలిపి మొత్తం బకాయిలు రూ.10,000 కోట్ల నుండి రూ.12,000 కోట్ల వరకు చేరాయి. ఇప్పటికే ఈ వ్యవహారం పైన రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తడంతో ప్రభుత్వం స్పందించింది. ఈ వ్యవహారం హైకోర్టుకు చేరింది. దీంతో, ఆగస్టు 15లోగా ఈ ఏడాదికి సంబంధించిన బకాయిలన్నింటినీ పూర్తిగా విడుదల చేస్తామని హైకోర్టుకు స్పష్టం చేసింది. 2, 3, 4వ సంవత్సరం విద్యార్థులకూ ఫీజు చెల్లిస్తామని పేర్కొంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ (మిగతా 2లో)


- ఫీజు రియింబర్స్‌మెంట్‌పై ప్రభుత్వం నిర్ణయం
- హైకోర్టు సాక్షిగా వెల్లడి..



# వారానికి ఒక్కటి చాలు...

- డయబెటిస్ బాధితులకు బిగ్ రిలీఫ్
- ఇక ప్రతిరోజు ఇన్సులిన్ ఇంజెక్షన్లు అవసరం లేదు
- అందరికీ అందుబాటు ధర

పీపుల్స్‌డైరీ–హైదరాబాద్ : మధుమేహ బాధితులకు ఇక ప్రతీ రోజు ఇన్సులిన్ ఇంజెక్షన్లు తీసుకొనే అవసరం లేకుండా వారంలో ఇక సారి మాత్రమే తీసుకొనే కొత్త ఇంజెక్షన్ అందుబాటులోకి వచ్చింది. కొత్త బేసల్ ఇన్సులిన్ అవిక్లీ (ఇన్సులిన్ ఐకోడెక్)ను భారత్‌లో విడుదల చేసారు. ఈ ఇంజెక్షన్ వారానికి ఒకటి మాత్రమే అవసరం కావటంతో.. ప్రతీ ఏటా 365 ఇంజెక్షన్లు చేయించుకోవాల్సిన వారు.. ఇక నుంచి 52 చేయిస్తే సరిపోతుంది. టైప్–1, టైప్–2 మధుమేహంతో బాధపడుతున్న వారికి ఈ ఇంజెక్షన్ వినయోగానికి (మిగతా 2లో...)



# నిర్లక్ష్యమే శాపం

## కళ్లముందే కూలుతున్న కాకతీయ వైభవం...

**పీపుల్స్‌డైరీ–గణపురం:** ఒకప్పుడు కాకతీయుల కళా వైభవానికి ప్రతీకగా వెలుగొందిన గణపురం... నేడు అధికారుల నిర్లక్ష్యానికి బలవుతోందా? దశాబ్దాల చరిత్రను ఒడిసిపట్టుకున్న కోటగుళ్ళు, రెడ్డిగుడి ఆలయాలు క్రమంగా శిథిలావస్థకు చేరుతున్నా వాటిని కాపాడాల్సిన శాఖలు ఎందుకు మౌనం పాటిస్తున్నాయి...? ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఎవరిది...? సుమారు 13వ శతాబ్దానికి చెందిన ఈ చారిత్రక ఆలయాలు కాకతీయుల అపూర్వ శిల్పకళకు సజీవ సాక్ష్యాలు. రాతిలో చెక్కిన ప్రతి శిల్పం చరిత్రను చెబుతున్నా... వాటిని కాపాడేందుకు మాత్రం ప్రభుత్వ యంత్రాంగం ముందుకు రావడం లేదు. వర్షాలు, ఎండలు, కాలగమన ప్రభావంతో శిల్పాలు దెబ్బతింటున్నా, శాశ్వత పరిరక్షణ చర్యలు ఎందుకు చేపట్టడం లేదు? అధికారులకు ఈ పరిస్థితి కనిపించడం లేదా? లేక కనిపించినా పట్టించుకోవడం లేదా? అనే ప్రశ్నలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. అప్పుడప్పుడు అధికారులు వచ్చి పరిశీలించి వెళ్లడం తప్ప, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిన దాఖలాలు కనిపించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిశీలనలతోనే బాధ్యత ముగిసిపోతుందా? నివేదికలు పంపితేనే (మిగతా 2లో...)

- కోటగుళ్లు... రెడ్డిగుడి... కాపాడేదెవరు...?
- 13వ శతాబ్దపు శిల్ప సంపదను పట్టించుకునేదెవరు..
- అధికారుల సందర్శనలు ఫొటోలకే పరిమితమా...?
- శిథిలమవుతున్న చారిత్రక కట్టడాలకు బాధ్యత ఎవరిది..
- పపంచ వారసత్వం గురించి గొప్పలు... స్థానిక వారసత్వంపై మౌనమెందుకు..?
- చరిత్ర రోదన అధికారులు చూస్తున్నారా...?
- కాకతీయ సంపదపై కరుణ ఎప్పుడు..?
- చరిత్రను కాపాడే వారే మౌనంగా ఉంటే ఎలా?






# బీఆర్ఎస్ 1400 కోట్లను అమరవీరుల కుటుంబాలకు పంచాలి

- ఆ నిధులు క్విడ్ ప్రోకో ద్వారా వచ్చినవే...
- ప్రాణం ఉన్నంత వరకూ మళ్లీ బీఆర్ఎస్‌లో చేరను..
- ఆంబోతులు, అడ్డగాడిదల్లా నన్ను అడ్డుకుంటున్నారు..
- టీఆర్ఎస్ అనే పేరు నాకు రాకుండా కుట్రలు
- కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు

2లో



పీపుల్స్‌డైరీ
వరంగల్
శుక్రవారం, 10 జూలై 2026
సంపుటి : 18, సంచిక : 124

# మేలుకో 'ఫుడ్ సేఫ్టీ'




(మొదటి పేజీ తరువాయి)

ప్రాంతాలకు పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక (బీదర్), మహారాష్ట్రల నుండి యథేచ్ఛగా గుట్కా, జర్దా, అంబర్ వంటి నిషేధిత పొగాకు ఉత్పత్తులు రవాణా అవుతున్నాయి. కమిషనరేట్ టాస్క్ ఫోర్స్ పోలీసులు నిఘా పెట్టి వాహనాలను ఇంటర్సెప్ట్ చేయడం, నిందితులను అరెస్ట్ చేయడం నిరంతరం జరుగుతున్న ప్రక్రియే.

అయినప్పటికీ, క్షేత్రస్థాయిలో కిరాణా షాపులు, పాన్ డబ్బాలలో ఇవి యథేచ్ఛగా దొరుకుతూనే ఉన్నాయి. పోలీసుల దాడులు కేవలం క్రిమినల్ కేసుల వరకే పరిమితమవుతుండగా, సదరు వ్యాపారులపై శాశ్వత నిషేధం విధించేలా ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ యాక్ట్ ప్రకారం కఠినమైన చర్యలు తీసుకోవడంలో ఆహార భద్రతా విభాగం వెనుకబడిందనే వాదన బలంగా వినిపిస్తోంది.

### నిబంధనలు ఉన్నా మౌనం ఎందుకు?

తెలంగాణ ప్రభుత్వం ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని గుట్కా, పాన్ మసాలా, నికోటిన్ కలిగిన పదార్థాల తయారీ, నిల్వ, రవాణా, విక్రయాలపై పూర్తి నిషేధాన్ని విధిస్తూ కఠినమైన ఆదేశాలు జారీ చేసింది.

ఆహార భద్రతా చట్టం-2006 ప్రకారం నికోటిన్, పొగాకు కలిపిన ఏ పదార్థమైనా 'ఆహారం' పరిధిలోకి రాదు కాబట్టి వాటిని పూర్తిగా నిషేధించే అధికారం ఫుడ్ సేఫ్టీ కమిషనర్‌కు ఉంటుంది. నిబంధనలు ఉల్లంఘించే దుకాణాల సీజ్, భారీ జరిమానాలు, లైసెన్స్ రద్దు చేసే పూర్తి బాధ్యత ఫుడ్ సేఫ్టీ అధికారులదే.

అయినప్పటికీ, క్షేత్రస్థాయిలో ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు చేయకపోవడం, కేవలం టాస్క్ ఫోర్స్ పట్టుకున్న తర్వాతే నామమాత్రపు చర్యలకు పరిమితమవ్వడం వెనుక అంతర్యం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. సిబ్బంది కొరతను సాకుగా చూపుతూ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

### మత్తులో యువత.. అగాధంలోకి భవిష్యత్తు

మాదక ద్రవ్యాలు, గుట్కా ప్రభావం వరంగల్ పరిసర ప్రాంతాల్లోని పాఠశాలలు, కాలేజీ విద్యార్థులపై తీవ్రంగా పడుతోంది. అతి చిన్న వయసులోనే ఓరల్ క్యాన్సర్ (నోటి క్యాన్సర్), సబ్‌మ్యూకస్ ఫైబ్రోసిస్ (నోరు తెరుచుకోకపోవడం) వంటి ప్రాణాంతక వ్యాధుల బారిన పడుతున్నారు.

### నేరాలు పెరగడం

గంజాయి, గుట్కా, మత్తు పదార్థాల అలవాటు పడిన యువత, వాటిని కొనడానికి డబ్బుల కోసం చోరీలు, చైన్ స్నాచింగ్‌లు, చివరకు ఘర్షణలు మరియు హత్యలకు కూడా వెనకాడటం లేదు.

### ప్రభుత్వం ఏం చేస్తోంది? ఎలాంటి చర్యలు తీసుకోవాలి?

ఈ విచ్చలవిడి విక్రయాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం యాంటీ నార్కోటిక్స్ బ్యూరోను ఏర్పాటు చేసి గంజాయిపై ఉక్కుపాదం మోపుతోంది. అయితే గుట్కా, తంబాకు లాంటి క్షేత్రస్థాయి మహమ్మారులను నిర్మూలించాలంటే ప్రభుత్వ యంత్రాంగం కింది చర్యలు వెంటనే చేపట్టాల్సి ఉంది

కేవలం పోలీసులే కాకుండా, ఫుడ్ సేఫ్టీ అధికారులు మరియు రెవెన్యూ విభాగం కలిసి సంయుక్తంగా నిరంతర తనిఖీలు చేపట్టాలి.

నిషేధిత పదార్థాలు విక్రయించే కిరాణా షాపులు, పాన్ డబ్బాల ట్రేడ్ లైసెన్సులను మున్సిపల్ కార్పొరేషన్ సహకారంతో శాశ్వతంగా రద్దు చేయాలి.

విద్యాసంస్థల పరిసరాల్లో 100 గజాల లోపు పొగాకు ఉత్పత్తులు అమ్మకూడదనే నిబంధనను కఠినంగా అమలు చేయడంతో పాటు, మత్తుకు బానిసలైన యువతకు డీ-అడిక్షన్ సెంటర్ల ద్వారా కౌన్సిలింగ్ ఇవ్వాలి.

## సర్వం కల్తీ మయం....

### అపరిశుభ్రంగా హెూటళ్లు, బేకరీల నిర్వహణ

వరంగల్ నగరంలో హోటళ్లు, బేకరీలు, ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాల్లో అపరిశుభ్ర పరిస్థితులు నెలకొన్నాయని, కల్తీ ఆహార పదార్థాలతో వంటకాలు తయారు చేసి విక్రయిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నాసిరకం నూనెలు, గడువు ముగిసిన పదార్థాలు, పరిశుభ్రత లేని వంటశాలల కారణంగా ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జ్వరం, విరేచనాలు, ఆహార విషబాధ వంటి సమస్యలు పెరుగుతున్నాయనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

ఇదే సమయంలో నగరంలోని కొన్ని చిన్న తరహా పరిశ్రమల్లో కల్తీ కారం పొడి, అల్లం పేస్ట్, వివిధ మసాలా పొడులు తయారు చేసి మార్కెట్‌లో విక్రయిస్తున్నారనే ఆరోపణలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. అధిక లాభాల కోసం కొందరు అక్రమ వ్యాపారులు ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెట్టి కల్తీ వ్యాపారం కొనసాగిస్తున్నారని వినియోగదారుల సంఘాలు మండిపడుతున్నాయి.

ఈ తరహా అక్రమాలకు అడ్డుకట్ట వేయాల్సిన ఫుడ్ సేఫ్టీ అధికారులు మాత్రం పూర్తి నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నగరంలో ఎక్కడైనా కల్తీ ఆహార పదార్థాలు బహిరంగంగా విక్రయిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. "ఫుడ్ సేఫ్టీ అధికారులు ఉన్నట్టా? లేనట్టా?" అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

హైదరాబాద్ వంటి మహానగరాల్లో ఇటీవల ఫుడ్ సేఫ్టీ అధికారులు నిరంతర తనిఖీలు నిర్వహిస్తూ నిబంధనలు ఉల్లంఘిస్తున్న హోటళ్లు, బేకరీలు, ఫుడ్ తయారీ కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకుంటున్న సంగతి తెలిసిందే. అదే తరహాలో వరంగల్‌లో కూడా ప్రత్యేక తనిఖీలు చేపట్టి కల్తీ వ్యాపారులపై ఉక్కుపాదం మోపాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

హోటళ్లు, బేకరీలు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, మసాలా తయారీ యూనిట్లపై రెగ్యులర్ తనిఖీలు నిర్వహించాలని, నాణ్యత ప్రమాణాలు పాటించని సంస్థల లైసెన్సులు రద్దు చేయాలని, కల్తీ ఆహార పదార్థాలు తయారు చేసే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని వినియోగదారులు కోరుతున్నారు. ప్రజల ఆరోగ్య రక్షణ కోసం ఫుడ్ సేఫ్టీ శాఖ తక్షణమే మేల్కొని కఠిన చర్యలు చేపట్టాలని నగరవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# వారానికి ఒక్కటి చాలు...

(మొదటి పేజీ తరువాయి)

అనుమతి దక్కింది. భారత్ లో వేగంగా షుగరు వ్యాధి పెరుగుతోంది. దాదాపు 10.01 కోటి మంది మధుమేహంతో సహవాసం చేస్తున్నారు. వారిలో దాదాపు 70 శాతం మంది బాధితులు ఇన్సులిన్ వినియోగిస్తున్నారు. మిగిలిన వారు టాబ్లెట్లతో నెట్టుకొస్తున్నారు. ఇక, ఇప్పుడు వారానికి ఇక్క సారి మాత్రమే తీసుకునే ఈ బేసల్ ఇంజెక్షన్ అందుబాటులోకి రావటంతో... వారు సైతం ఈ ఇంజెక్షన్ల వినియోగం వైపు మొగ్గు చూపే అవకాశం ఉంటుందని అంచనా వేస్తున్నారు.



అందుబాటు ధరల్లోనే అవిక్లీ ధరలను భారత్ లో ఖరారు చేసారు. ఇక్కడి మార్కెట్ కు అనుగుణంగా ధరలను ఫిక్స్ చేసిన తయారీ సంస్థ నోవో నోర్డిస్క్ వెల్లడించింది. 700 ఇన్సులిన్ యూనిట్లు కలిగిన 1 మిల్లీలీటర్ అవిక్లీ పెన్ ధరను రూ.2,611గా నిర్ణయించారు. అదే విధంగా 2,100 యూనిట్లు కలిగిన 3 మిల్లీలీటర్ పెన్ ధర రూ.7,883గా ఫిక్స్ చేసారు. వారానికి 70 యూనిట్ల మోతాదు తీసుకునే రోగికి ఈ చికిత్స ఖర్చు వారానికి దాదాపు రూ.261 నుంచి రూ.263 వరకు ఉండే అవకాశం ఉంది. కాగా, ప్రస్తుతం లాభాల కంటే.. ఎక్కువ మంది వినియోగించే చేయటమే తమ ప్రధాన లక్ష్యమని కంపెనీ స్పష్టం చేసింది. ఈ ఇంజెక్షన్ షుగరు వ్యాధి బాధితులకు మరింత ప్రయోజనకరంగా ఉంటుందని విశ్లేషణలు వస్తున్నాయి. దీంతో.. ఇక్కడా వినియోగం పెరిగితే.. వచ్చే ఫలితాల ఆధారంగా మరింత గా అమ్మకాల ప్రభావం ఉంటుందని పేర్కొంటున్నారు.

# మూసీ పునరుజ్జీవనానికి అడుగు..

- రూ.7,345 కోట్ల పరిపాలనా అనుమతులు మంజూరు
- మూసీ తీరంలో మారనున్న రూపురేఖలు

పీపుల్స్‌డైరీ-హైదరాబాద్ : హైదరాబాద్ నగరాన్ని అంతర్జాతీయ నగరాల సరసన నిలిపేందుకు తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టులో కీలక ముందడుగు పడింది. ఈ మెగా ప్రాజెక్టు పరిధిలోని ప్రాధాన్యతా ప్రాంతాల అభివృద్ధి కోసం రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ రూ.7,345.12 కోట్ల భారీ బడ్జెట్‌కు పరిపాలనా అనుమతులు మంజూరు చేస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో సుదీర్ఘ కాలంగా ప్రతిపాదనల దశలో ఉన్న మూసీ సుందరీకరణ, పునరుజ్జీవన పనులు త్వరలోనే క్షేత్రస్థాయిలో వేగవంతం కానున్నాయి. అయితే, ఈ కేటాయించిన నిధులలో కేవలం అభివృద్ధి పనుల వ్యయం మాత్రమే ఉందని భూసేకరణ ఖర్చులను ఇందులో చేర్చలేదని అధికారులు స్పష్టం చేశారు. భూసేకరణకు సంబంధించిన నిధులను ప్రభుత్వం విడిగా కేటాయించనుంది.

ఈ భారీ ప్రాజెక్టు మొదటి విడతలో భాగంగా జోన్-1ఏ, జోన్-1బీ పరిధిలోని ప్రాంతాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దనున్నారు. జోన్-1ఏ కింద హిమాయత్‌సాగర్ నుంచి బాపూఘాట్ వరకు ఉన్న నదీ తీరాన్ని, అలాగే జోన్-1బీ కింద ఉస్మాన్‌సాగర్ నుంచి బాపూఘాట్ వరకు ఉన్న పరివాహక ప్రాంతాలను అనుసంధానిస్తూ అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. నదిలోకి మురుగునీరు చేరకుండా అడ్డుకట్ట వేయడం, నదీ తీరాల వెంబడి పచ్చదనం పెంపొందించడం, పర్యాటక ప్రాంతాలుగా మలచడం, అవసరమైన మౌలిక వసతుల కల్పన ఈ పనుల్లో ప్రధాన భాగం కానున్నాయి. హైదరాబాదీయులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించడమే లక్ష్యంగా ఈ జోన్లను ముస్తాబు చేయనున్నారు.

# నిర్లక్ష్యమే శాపం...

(మొదటి పేజీ తరువాయి)

చరిత్ర రక్షితమవుతుందా? అంటూ గ్రామ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. రాష్ట్రంలో కాకతీయుల వారసత్వ పరిరక్షణపై పెద్దఎత్తున ప్రచారం జరుగుతుంటే, గణపురంలోని ఈ చారిత్రక కట్టడాల విషయంలో మాత్రం అదే చొరవ ఎందుకు కనిపించడం లేదు? పర్యాటకంగా అభివృద్ధి చేసే అవకాశం ఉన్నప్పటికీ ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారు? ప్రత్యేక నిధులు ఎందుకు కేటాయించడం లేదు? పురావస్తు శాఖ, ఎండోమెంట్ శాఖ, పర్యాటక శాఖల్లో అసలు ఈ ఆలయాల బాధ్యత ఎవరిది? కోట్ల రూపాయలతో కొత్త నిర్మాణాలు చేపట్టే ప్రభుత్వాలు, శతాబ్దాల చరిత్రను మోస్తున్న ఈ అమూల్య సంపదను కాపాడటంలో ఎందుకు వెనుకబడుతున్నాయి? కాకతీయుల చరిత్రపై సభల్లో ప్రసంగాలు చేసే ప్రజాప్రతినిధులు... గణపురంలోని కాకతీయ వారసత్వాన్ని ఎందుకు పట్టించుకోవడం లేదు? ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పేది ఎవరు? ఇప్పటికైనా ప్రభుత్వం, పురావస్తు శాఖ, ఎండోమెంట్ శాఖ సంయుక్తంగా ప్రత్యేక కార్యాచరణ చేపట్టి కోటగుళ్ళు, రెడ్డిగుడి ఆలయాలను శాస్త్రీయ పద్ధతిలో సంరక్షించాలని, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. లేదంటే కాకతీయుల అపురూప శిల్ప వైభవం కాలగర్భంలో కలిసిపోయి, భావితరాలకు కేవలం చరిత్ర పుస్తకాలలోని చిత్రాలుగానే మిగిలిపోయే ప్రమాదం ఉందని చరిత్రాభిమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# జీతాల చెల్లింపుపై మంత్రి కీలక ఆదేశాలు

(మొదటి పేజీ తరువాయి)

ఉద్యోగులతో పాటే వీరికి కూడా ఒకటో తేదీనే జీతాలు విడుదల చేయనున్నారు. వివిధ ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా ప్రభుత్వ ఆసుపత్రులలో విధుల్లో చేరిన ఔట్ సోర్సింగ్ సిబ్బంది పడుతున్న ఆర్థిక ఇబ్బందులను, వారి ఆవేదనను మానవతా దృక్పథంతో అర్థం చేసుకున్నామని మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. అయితే ప్రస్తుతం ఉన్న సాంకేతిక విధానాల వల్ల ఏజెన్సీల బిల్లుల చెల్లింపుల్లో ఆలస్యం జరుగుతోంది. దీనిని అధిగమించి వారికి ప్రతి నెల 1వ తేదీన నేరుగా వేతనాలు విడుదల చేయడానికి వీలుగా.. సమగ్ర ఆర్థిక నిర్వహణ వ్యవస్థ అయిన ఐహెచ్ఎఫ్ఎంఎస్ పోర్టల్ పాలసీలో అవసరమైన సవరణలు, మార్పులు తీసుకురావాలని వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులను మంత్రి ఆదేశించారు. సాఫ్ట్‌వేర్‌లో మార్పులు పూర్తయితే బిల్లుల ప్రక్రియ మరింత సులభతరం కానుంది.

# ఆగస్టు 15లోపు బకాయిలు చెల్లిస్తాం..

(మొదటి పేజీ తరువాయి)

పై హైకోర్టులో విచారణ జరిగింది. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్ మెంట్ చెల్లించడం లేదంటూ పలు ఇంజినీరింగ్ కళాశాలలు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసాయి. కాగా, ప్రభుత్వ ప్రతిపాదనను పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వ్యతిరేకించారు.

ప్రభుత్వం రాష్ట్రంలో కొన్నేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించడం లేదని కోర్టు దృష్టికి తీసుకువెళ్లారు. ఆ బకాయిలు దాదాపు రూ.10 వేల కోట్లు ఉంటుందన్నారు. 2023 నుంచి ఉన్న పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని కళాశాలల యాజమాన్యాలు కోరాయి. తర్వాత కొంత గడువుతో మిగతా బకాయిలు చెల్లించేలా చూడాలని హైకోర్టును అభ్యర్ధించారు. గత విచారణలో జీవో9లో నాలుగు నిబంధనలపై షరతు విధించింది. అందులో కొన్ని నిబంధలపై విధించిన స్టే ఎత్తివేయాలని ప్రభుత్వం హైకోర్టుకు విజ్ఞప్తి చేసింది. కాగా, ప్రభుత్వ తరపు న్యాయవాది వచ్చే నెల ఆగస్టు 15 లోగా బకాయిలు చెల్లిస్తామని స్పష్టం చేసారు. దీంతో.. కళాశాలల యాజమాన్యాలు నిరీక్షిస్తున్న బకాయిల చెల్లింపు కు ముహూర్తం ఫిక్స్ అయింది.

# బీఆర్ఎస్ 1400 కోట్లను అమరవీరుల కుటుంబాలకు పంచాలి

- ఆ నిధులు క్విడ్ ప్రోకో ద్వారా వచ్చినవే...
- ప్రాణం ఉన్నంత వరకూ మళ్లీ బీఆర్ఎస్‌లో చేరను..
- ఆంబోతులు, అడ్డగాడిదల్లా నన్ను అడ్డుకుంటున్నారు..
- టీఆర్ఎస్ అనే పేరు నాకు రాకుండా కుట్రలు
- కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు

పీపుల్స్‌డైరీ-కొత్తగూడెం : సింగరేణి బాయి బాట కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కొత్తగూడెంలోని పీవీకే 5 గనిలోకి వెళ్లి కార్మికులతో మాట్లాడారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆమె బీఆర్ఎస్‌ను టార్గెట్ చేసుకొని తీవ్ర స్థాయిలో ఆరోపణలు గుప్పించారు. బీఆర్ఎస్ బ్యాంక్ ఖాతాలో ఉన్న రూ. 1400 కోట్లు క్విడ్ ప్రో క్రో ద్వారా ఏపీ కాంట్రాక్టర్ల నుంచి వచ్చినవేనన్న కవిత.. ఆ సొమ్మును అమర వీరుల కుటుంబాలకు పంచాలని డిమాండ్ చేశారు.

తాను బీఆర్ఎస్‌లోకి వెళ్తానని ప్రచారం చేస్తున్నారని.. అయితే తన కంఠంలో ప్రాణం ఉండగా మళ్లీ బీఆర్ఎస్‌లోకి వెళ్లేదే లేదని, ఆ పార్టీతో జత కట్టేదే లేదని ఆమె స్పష్టం చేశారు. వ్యక్తిగతంగా తాను ఎన్నో అవమానాలకు గురయ్యాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

తాము అధికారంలోకి వచ్చిన తర్వాత 2014 నుంచి కేసీఆర్, రేవంత్ రెడ్డి ప్రభుత్వాలు వివిధ సంస్థలకు అప్పగించిన భూముల వివరాలను రివ్యూ చేస్తామని కవిత తెలిపారు. తాను ప్రజల్లో ఉండే పోరాడతానన్న కవిత.. తల్లి, చెల్లి అనే ఇంగితం మర్చిపోయి సోషల్ మీడియాలో కామెంట్లు పెడుతున్నారన్న ఆమె.. మర్యాద పాటించాలని హితవు పలికారు. ఈ సందర్భంగా ఆమె బీఆర్ఎస్ సోషల్ మీడియాకు హెచ్చరికలు జారీ చేశారు. తమ పార్టీలోని యువత వ్యక్తిగత కామెంట్ల జోలికి పోరన్న కవిత.. లైన్ దాట్టొదని బీఆర్ఎస్ శ్రేణులను హెచ్చరించారు.

తమ పార్టీతో భయం లేదంటూనే ఎన్నికల సంఘానికి వెయ్యికిపైగా ఫిర్యాదులు ఇచ్చారన్న కవిత.. టీఆర్ఎస్ అనే పేరు తనకు రాకుండా ఉండటం కోసం కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. హరీశ్ రావును కాళేశ్వరం అనకొండ అంటూ సంచలన ఆరోపణలు చేసిన కవిత.. ఆయన్ను బీఆర్ఎస్ ఇంకా ముందు పెడుతోందన్నారు. కేటీఆర్ తన మిత్రుడు ప్రదీప్ కన్ స్ట్రక్షన్స్‌కు క్విడ్ ప్రో కో ద్వారా అక్రమ పర్మిషన్లు ఇచ్చారని కవిత ఆరోపించారు.

# ఆలయ అభివృద్ధికి మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు విరాళం

- చలమప్పగూడెంలో కోదండ రామాలయం ప్రతిష్ఠ మహోత్సవం
- ప్రత్యేక పూజల్లో పాల్గొని ప్రజల సంక్షేమం కోసం ప్రార్థనలు

**దమ్మపేట జూలై 09(పీపుల్స్ డైరీ) :** దమ్మపేట మండలం చలమప్పగూడెం గ్రామంలో అత్యంత వైభవంగా నిర్వహించిన శ్రీశ్రీశ్రీ పశ్చిమాభిముఖ కోదండ రామాలయం, బొడ్రాయి ప్రతిష్ఠ మహోత్సవంలో బూర్గంపహాడ్-అశ్వారావుపేట మాజీ శాసనసభ్యులు, తెలంగాణ రాష్ట్ర తొలి ట్రైకార్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు తాటి వెంకటేశ్వర్లు పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన తాటి వెంకటేశ్వర్లు స్వామివారిని దర్శించుకుని అశ్వారావుపేట నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో అభివృద్ధి చెందాలని భక్తిశ్రద్ధలతో ప్రార్థించారు.

### ఆలయ అభివృద్ధికి రూ.10 వేల విరాళం

ఆలయ అభివృద్ధి కార్యక్రమాలకు తన వంతు సహకారంగా తాటి వెంకటేశ్వర్లు రూ.10,000 నగదు విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. దేవాలయాలు ఆధ్యాత్మిక చైతన్యానికి కేంద్రాలుగా నిలుస్తాయని, ఆలయ అభివృద్ధికి ఎల్లప్పుడూ తన సహకారం కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు.

ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు తాటి వెంకటేశ్వర్లును శాలువాతో ఘనంగా సన్మానించి, ఆలయ అభివృద్ధికి అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ ప్రజలు, భక్తులతో ఆయన ఆప్యాయంగా మమేకమై వారి సమస్యలు, అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.



# కేసీఆర్ నమ్మకానికి నిదర్శనం..

- పార్లమెంట్ ఫ్లోర్ లీడర్‌గా వద్దిరాజు రవిచంద్ర
- ఖమ్మంలో ఘనంగా శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

దమ్మపేట, జూలై 09(పీపుల్స్ డైరీ) : రాజ్యసభ సభ్యుడు, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ వద్దిరాజు రవిచంద్రను బీఆర్ఎస్ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు పార్లమెంట్ పార్టీ ఫ్లోర్ లీడర్‌గా నియమించారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మెచ్చా నాగేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మెచ్చా నాగేశ్వరరావు మాట్లాడుతూ, "పార్లమెంట్‌లో తెలంగాణ ప్రజల గొంతుకగా, బీఆర్ఎస్ పార్టీ విధానాలను సమర్థవంతంగా వినిపించే నాయకత్వ లక్షణాలు ఉన్నందుకే కేసీఆర్ రవిచంద్రకు ఈ కీలక బాధ్యతను అప్పగించారు. ఆయన నాయకత్వంలో పార్లమెంట్‌లో తెలంగాణ హక్కుల కోసం బీఆర్ఎస్ మరింత బలంగా పోరాడుతుంది" అని పేర్కొన్నారు. పార్టీ అధినేత కేసీఆర్ తీసుకున్న ఈ నిర్ణయం బీఆర్ఎస్ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపిందని, రవిచంద్ర నియామకం పార్టీకి మరింత బలం చేకూరుస్తుందని ఆయన అన్నారు.

బీఆర్ఎస్ పార్టీకి, తెలంగాణ ప్రజలకు నిరంతరం సేవలందిస్తున్న వద్దిరాజు రవిచంద్రకు పార్లమెంట్ ఫ్లోర్ లీడర్ బాధ్యతలు దక్కడం ఆయన రాజకీయ ప్రస్థానంలో మరో మైలురాయిగా పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారు.



పీపుల్స్ డైరీ

వరంగల్

శుక్రవారం, 10 జూలై 2026

సంపుటి : 18, సంచిక : 124



# పింఛన్ బాంచెన్.. చెంచు పల్లి ప్రజల ఎదురుచూపులు

- ఆసరా పింఛన్ల పంపిణీలో జాప్యం..
- ప్రతి నెలా గత నెల పింఛనే పంపిణీ..
- లబ్ధిదారులకు తప్పని ఎదురుచూపులు..
- ఇప్పటికే రెండు నెలల పింఛన్ ఎగవేత..
- ఇబ్బందుల్లో పండుటాకులు, దివ్యాంగులు..



**రేగొండ జూలై 09 పీపుల్స్ డైరీ :** నేటికి మూడు నెలలు గడుస్తున్న. ప్రభుత్వం ఇవ్వాల్సిన ఆసరా పింఛన్ సొమ్మును. ప్రతి నెలలో ఇవ్వాల్సిన ఆసరా పింఛన్ సొమ్మును నెలలు గడుస్తున్న ఇవ్వనేలేదు. ఇది ఈ ఒక్క నెలలోనే కాదు. ప్రతి నెల జాప్యం చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తూ వస్తున్న అధికారులు ఆసరా పింఛన్ సొమ్మును ఒక నెల ఆలస్యంగా ఇస్తూ వస్తున్నది. దీంతో 'ఆసరా'పైనే ఆధారపడే వృద్ధులు ,పండుటాకులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు ప్రతి నెల పింఛన్ డబ్బుల కోసం ఎదురు చూపులు తప్పడం లేదు. ఇదంతా ఎక్కడ అనుకుంటున్నారా? జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం చెంచుపల్లిలో జరుగుతున్న తతంగం.అమాయక ప్రజలు కావడం ప్రశ్నించే తత్వం లేకపోవడం వారి పట్ల శాపంగా మారుతుంది.నెలలు గడుస్తున్న చెంచు వాసులకు రావలసిన పింఛన్ డబ్బుల అందకపోవడం వల్ల ఇబ్బంది పడుతున్నారు.ఎవరిని అడగాలో తేలియక ఐదు కిలోమీటర్లు నడిచే ఓపిక లేక పింఛన్ డబ్బులు తీసుకోవడం లేదు తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గ్రామపంచాయతీగా ఏర్పాటులో చెన్నాపూర్ గ్రామం నుండి చెంచుపల్లి ని వేరుచేసి నూతన చిన్న గ్రామపంచాయతీగా ఏర్పర్చారు కాగా ఆ గ్రామానికి చెందిన వ్యక్తి సర్పంచి కావడం ఆ గ్రామానికి శాపంగా మారుతుంది. చెన్నాపూర్ గ్రామంలో పెన్షన్ డబ్బులు అందించే పోస్ట్ ఆఫీస్ వ్యక్తి ప్రతినెల సెంచుపల్లి గ్రామానికి వెళ్లి అక్కడ ఉన్న లబ్ధిదారులకు పింఛన్ డబ్బులు అందించాలి కానీ అలా చేయకుండా మూడు నాలుగు నెలలకు ఒకసారి చెంచుపల్లి గ్రామానికి వెళ్లి ఒకటో నెల రెండో నెల డబ్బులు ఇస్తూ వస్తున్నాడు ఇలా ప్రతినెల పెన్షన్ డబ్బులు అందకపోవడంతో సెంచు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆ గ్రామంలో దాదాపు పది నుండి 12 మంది వరకు వృద్ధాప్య పెన్షన్ లబ్ధిదారులు ఉంటారు కానీ వారికి ప్రతినెల పెన్షన్ ఇవ్వడానికి ఆ గ్రామానికి వెళ్లి అందించే వ్యక్తి చెంచు పల్లి కి వెళ్లి ఇవ్వడం లేదు పెన్షన్ లబ్ధిదారులు ఆసరా డబ్బులు తీసుకోవాలంటే 5 కిలోమీటర్లు నడవ వలసిన పరిస్థితి ఏర్పడింది. ఇదే అదనుగా పోస్ట్ ఆఫీస్ అధికారి రెండు మూడు నెలలకు ఒకసారి కూడా చెంచుపల్లి గ్రామానికి పెన్షన్ డబ్బులు ఇవ్వడం లేదు ఇది ఇలా ఉంటే అమాయక ప్రజలు కావడం అధికారులు ఇష్టం ఉన్న రీతిలో వ్యవహరిస్తున్నారని పెన్షన్ లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే ప్రతి నెల 2016 ఇవ్వాల్సింది పోయి వారికి 2000 రూపాయలు ఇస్తూ 16 రూపాయలు ఇవ్వాలని ప్రశ్నిస్తే ఎవరికీ చెప్ప రో చెప్పుకోండి అంటూ బెదిరిస్తున్నారంటూ ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు జిల్లా కలెక్టర్ చెంచు కాలనీ ప్రజల బాధను అర్థం చేసుకొని ప్రతి నెల ఆసరా పెన్షన్ డబ్బులు అందే విధంగా చూడాలని కోరుకుంటున్నారు.చిన్నచిన్న అవసరాలు తీర్చుకొనేది. కానీ నూతన గ్రామం ఏర్పడ్డాక లబ్ధిదారులకు మళ్లీ కష్టాలు మొదయ్యాయి. నెలానెలా పింఛన్ నగదుకోసం కండ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు. బ్యాంకులు, పోస్టాఫీసుల చుట్టూ తిరిగి తిరిగి వేసారిపోతున్నారు. కనీస అవసరాలు తీర్చుకోలేని పరిస్థితుల్లో మళ్లీ కుటుంబ సభ్యులను దేహీ అంటూ దేబరించాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నోసార్లు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా తమ గోడు పట్టించుకోవడం లేదని బాధితులు వాపోతున్నారు. ఉమ్మడి గ్రామం ఉన్నప్పుడు ఏనాడూ బాధపడలేదని, ప్రతినెలా వేళకు పింఛన్ సొమ్ము అందేదని వాపోతున్నారు.

# ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు పోటీతత్వంతో కృషి చేయాలి

- సర్పంచులు,కార్యదర్శుల అవగాహన సదస్సులో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు,

**భూపాలపల్లి జూలై 09 పీపుల్స్ డైరీ :** గ్రామాభివృద్ధికి ప్రణాళికలు తయారు చేయాలని భూపాలపల్లి శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణరావు తెలిపారు. పంచాయతి రాజ్ శాఖ ఆధ్వర్యంలో గురువారం ఐడిఓసి కార్యాలయంలో గ్రామ పంచాయతి అభివృద్ధి ప్రణాళికలు అంశంపై చిట్యాల, కొత్తపల్లి గోరి, రేగొండ, మొగుళ్లపల్లి, టేకుమట్ల మండలాల సర్పంచులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన అవగహన సదస్సును జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మౌలిక సదుపాయాలు, ప్రజలకు ఉపయోగపడే ప్రణాళికలు తయారు చేయాలని తెలిపారు. గ్రామ పంచాయతిలు ఆదాయ వనరులు సొంతంగా సమకూర్చుకోవాలని సూచించారు. గ్రామాల నుండి దేశ, విదేశాలలో నివసిస్తున్న ప్రముఖులు ద్వారా గ్రామాలు అభివృద్ధికి నిధులు సమకూర్చుకోవాలని తెలిపారు.ప్రతి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు పోటీతత్వంతో కృషి చేయాలని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ద్వారా వస్తున్న నిధులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 320 కోట్లతో మొరంచపల్లి వాగుపై చెక్ డ్యామ్ లు నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. పంట కాలువలు సిమెంట్ లైనింగ్ కొరకు 55 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. టిబిఎం 38 ద్వారా 44700 ఎకరాలకు సాగునీరు అందించేందుకు డిపిఆర్ సిద్ధం చేసినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి సర్పంచులు లీడ్ తీసుకోవాలని తెలిపారు. గ్రామాల అభివృద్ధికి మొదటి, రెండు, మూడు సంవత్సరాలకు ప్రణాళికలు తయారు చేయాలని, అట్టి ప్రణాళిక సంవత్సరం వారీగా కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. గ్రామ, మండల ప్రణాళికలు కనుగుణంగా జిల్లా స్థాయి ప్రణాళిక తయారు చేయనున్నట్లు తెలిపారు. మిషన్ భగీర ద్వారా మంచినీటి సరఫరా చేయాలని ఎక్కడైనా నీటి సరఫరాలో ఇబ్బందులు ఎదురైనట్లయితే ప్రత్యామ్నాయంగా మంచినీటి సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. మంచినీటి సమస్య ఎట్టి పరిస్థితిలోను నీటి ఎద్దడి రావోద్దని స్పష్టం చేశారు. తడి, పొడి వ్యర్థాలు నిర్వహణ 16 ఆర్థిక సంఘం నిధులు వినియోగం పకడ్బందీగా అమలు చేయాలని తెలిపారు. గ్రామాల నుండి అభివృద్ధి జరగాలని ఆయన స్పష్టం చేశారు. గ్రామాభివృద్ధికి ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు ఎంతో ఉపయోగప డతాయని ఇట్టి శిక్షణ కార్యక్రమాలను వినియోగించి గ్రామాలు అభివృద్ధిని సాధించాలని సూచించారు. జిల్లాలో 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిం చామని తెలిపారు. అట్టి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను ప్రాధాన్యతను బట్టి మొదటి, రెండవ, మూడు సంవత్సరాలలో పరిష్కరించేలా సమగ్ర కార్యాచరణ ప్రణాళికలు తయారు చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, శిక్షణ డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బుర్రా కొమురయ్య, ఆయా మండలాల సర్పంచులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



# వికసిత్ భారత్--2047 లక్ష్య సాధనలో ప్రతి బీజేపీ కార్యకర్త భాగస్వామి కావాలి

రాష్ట్ర అధికార ప్రతినిధి ఆరుట్ల దశమంత రెడ్డి



**జయశంకర్ భూపాలపల్లి, జూలై 9 పీపుల్స్ డైరీ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు ఏడునూతుల నిషిధర్ రెడ్డి అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం, ఎస్ఐఆర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర అధికార ప్రతినిధి ఆరుట్ల దశమంత రెడ్డి హాజరయ్యారు. సమావేశంలో వికసిత్ భారత్--2047 లక్ష్య సాధనకు పునాది వేస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం విజయవంతంగా 12 సంవత్సరాల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా అభినందన తీర్మానాన్ని, రాష్ట్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను ఖండిస్తూ రాజకీయ తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు.అనంతరం ఎస్ఐఆర్ కార్యక్రమం పురోగతి, పార్టీ సంస్థాగత బలోపేతం, రాబోయే పార్టీ కార్యక్రమాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఆరుట్ల దశమంత రెడ్డి మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం గత 12 సంవత్సరాల్లో దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించిందన్నారు. రైతులు, పేదలు, మహిళలు, యువత, వెనుకబడిన వర్గాల సంక్షేమమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. వికసిత్ భారత్--2047 లక్ష్య సాధనలో ప్రతి బీజేపీ కార్యకర్త భాగస్వామి కావాలని, కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేయడంతో పాటు ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రతి నాయకుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షులు ఏడునూతుల నిషిధర్ రెడ్డి మాట్లాడుతూ, పార్టీ బలోపేతమే ప్రతి కార్యకర్త ప్రధాన బాధ్యత అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికి చేర్చేలా క్షేత్రస్థాయిలో పనిచేయాలని సూచించారు. ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని బూత్ స్థాయి వరకు సమర్థవంతంగా అమలు చేసి పార్టీ నిర్మాణాన్ని మరింత పటిష్ఠం చేయాలని అన్నారు. జిల్లా, మండల, శక్తికేంద్ర, బూత్ స్థాయి నాయకులు సమన్వయంతో పనిచేస్తూ రాబోయే పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేయాలని, ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతూ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లింగంపల్లి ప్రసాద్ రావు, జన్నే మొగిలి, ఎరుకల గణపతి, మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెన్నంపల్లి పాపన్న, రాష్ట్ర నాయకులు రాయరాకుల మొగిలి, జిల్లా ప్రధాన కార్యదర్శులు తాటికొండ రవికిరణ్, దొంగల రాజేందర్, వివిధ మోర్చాల జిల్లా అధ్యక్షులు, వివిధ మండలాల అధ్యక్షులు, జిల్లా నాయకులు, మండల నాయకులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# విద్యాసంస్థల బందును జయప్రదం చేయండి

పసుల వినయ్ కుమార్, ప్రోగ్రెసివ్ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉమ్మడి జిల్లా అధ్యక్షులు

**భూపాలపల్లి జూలై 09 పీపుల్స్ డైరీ..:** తెలంగాణ రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యల పరిష్కారానికి నేడు రాష్ట్ర వ్యాప్త విద్యాసంస్థల బందుకు విద్యాసంస్థల యాజమాన్యాలు సహకరించి జయప్రదం చేయాల్సిందిగా పసుల వినయ్ కుమార్ విజ్ఞప్తి చేశారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రభుత్వ బడుల మూసివేత ఆలోచనను విరమించుకోవాలని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పాఠ్యపుస్తకాల అందించాలని మధ్యాహ్న భోజనానికి నిధులు పెంచాలని ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ ఎంఈఓ డీఈవో లెక్చరర్స్ పోస్టులు భర్తీ చేయాలని పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ల ఫీజు రియంబర్స్మెంట్స్ విడుదల చేయాలని ఇంటర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని తక్షణమే ప్రారంభించాలని విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలని ప్రతి పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్ సౌకర్యం కల్పించాలని అద్దె భవనాల్లో కొనసాగుతున్న గురుకులాలకు పర్మినెంట్ బిల్డింగ్స్ కట్టించాలని పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ కాస్మోటిక్ చార్జీలు పెంచాలని విద్యాసంస్థల్లో ర్యాగింగ్ డ్రగ్స్ నిరోధక కమిటీలను ఏర్పాటు చేయాలని రాష్ట్రంలో విద్యార్థి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని విద్యా రంగంలో నెలకొన్న సమస్యలు అన్నిటికీ పరిష్కార మార్గం చూపి పరిష్కరించాలని ఈ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బందుకు పిలుపునివ్వడం జరిగిందని ఈ బందుకు అందరూ సహకరించి జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు..



# బంగారు పతకం సాధించిన గూడూరు గ్రామవాసి పాక రమేష్

తెలంగాణ పోలీస్ స్పోర్ట్స్ మీట్ లో బంగారు పతకం సాధించిన పాక రమేష్




**కమలాపూర్ జులై 9 (పీపుల్స్ డైరీ ) :** కమలాపూర్ మండల కేంద్రంలోని గూడూరు గ్రామానికి చెందిన పాక రమేష్ యాదవ్ కేతమ్మ రాజయ్య దంపతుల మొదటి సంతానమైన రమేష్ వ్యవసాయ కుటుంబానికి చెందినవాడైనప్పటికీ చిన్నప్పటి నుంచి పోలీస్ కావాలనే కోరిక ఉండేది, అదే దృఢ సంకల్పంతో కష్టపడి చదివి 2020లో ఏ ఆర్ కానిస్టేబుల్ గా ఉద్యోగం సాధించి తన ఆశయాన్ని నెరవేర్చుకున్నాడు. ప్రస్తుతం భువనగిరిలో ఏ ఆర్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్నాడు. ఉద్యోగంలో భాగంగా 09 -07- 2026 తెలంగాణ పోలీస్ గేమ్స్ మరియు స్పోర్ట్స్ మీట్ లో జరిగిన క్రీడల్లో పాక రమేష్ తెలంగాణ స్టేట్ పోలీస్ తరపున ఆమ్ రెజ్లింగ్ క్రీడలో పాల్గొని బంగారు పతకాన్ని సాధించాడు. అంతేకాకుండా ఇక ముందు జరగబోయే నేషనల్ ఆల్ ఇండియా పోలీస్ మీట్ కు, తెలంగాణ రాష్ట్రం తరఫున అర్హత సాధించాడు. రమేష్ సాధించిన ఈ ఘనత తెలంగాణ పోలీస్ కే గర్వకారణమని అంతేకాకుండా తను పుట్టి పెరిగిన గూడూరు గ్రామానికి ఎంతో పేరు ప్రతిష్టలను అందించాడని గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.

# బీజేపీ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా...

ఎరుకల గణపతి,లింగంపల్లి ప్రసాద్ రావు,



**భూపాలపల్లి జూలై 09 పీపుల్స్ డైరీ :** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు నరప రాజు రామచంద్ర రావు, ఆదేశాల మేరకు, గురువారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు ఏడు నూతుల నిషిధర్ రెడ్డి,రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా లింగంపల్లి ప్రసాదరావు, జన్నె మొగిలి, ఎరుకల గణపతిలను నియమించారు.అదేవిధంగా కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులుగా పొలసాని తిరుపతిరావు, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలిగా బూర పద్మ, ఓ బి సి మోర్చా జిల్లా అధ్యక్షుడిగా దేశెట్టి గోపాల్ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులుగా పుల్యాల రాజు, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షులుగా అజ్మీర రాజు నాయక్లను ప్రకటించారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు ఏడు నూతుల నిషిధర్ రెడ్డి మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నూతనంగా నియమితులైన పదాధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా సేవాభావంతో పనిచేసి జిల్లాలో భారతీయ జనతా పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పదాధికారులు తమపై పార్టీ నాయకత్వం ఉంచిన విశ్వాసానికి కృతజ్ఞతలు తెలుపుతూ, పార్టీ అభివృద్ధి కోసం అంకితభావంతో పనిచేస్తామని పేర్కొన్నారు.

# జిల్లా ప్రధాన న్యాయమూర్తిని మర్యాదపూర్వకంగా కలిసిన కలెక్టర్, ఎస్పీ





**భూపాలపల్లి జూలై 09 పీపుల్స్ డైరీ..** జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన జె. జీవన్ కుమార్ ను గురువారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తికి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పెండింగ్లో ఉన్న వివిధ కోర్టు కేసుల పురోగతిపై చర్చించారు. కేసులు త్వరితగతిన పరిష్కారానికి, న్యాయ ప్రక్రియ మరింత వేగవంతం కావడానికి జిల్లా యంత్రాంగం తరపున పూర్తి సహకారం ఉంటుందని ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి శ్రీమతి జి.అఖిల తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా వన మహోత్సవం

మేడ్చల్ మండల విద్యాశాఖ కార్యాలయం ఆవరణంలో

**మేడ్చల్, జూలై 9 :** పీవీ పాఠశాల ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి మేడ్చల్ మండల విద్యాశాఖ కార్యాలయం ఆవరణంలో వన మహోత్సవ కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి శంకర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కనీసం ఒక మొక్కను నాటి సంరక్షించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీవీ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు రామేశ్వరరావు, ఉపాధ్యాయులు, మండల విద్యాశాఖ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం


## రైతు భరోసా నిధుల విడుదలకు సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



**మేడ్చల్ జూలై 09(పీపుల్స్ డైరీ):-** మండలంలో రైతు భరోసా పథకం కింద కేవలం 9 రోజుల్లో రూ.9,000 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేసిన రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయానికి స్వాగతం పలుకుతూ కీసర మండల రైతు కాంగ్రెస్ అధ్యక్షుడు పిన్నింటి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, రైతు సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రైతు భరోసా నిధులను వేగంగా రైతుల ఖాతాల్లో జమ చేయడం ద్వారా ప్రభుత్వం రైతుల పట్ల తన నిబద్ధతను చాటుకుందని పేర్కొన్నారు. రైతులకు అండగా నిలుస్తూ వ్యవసాయ రంగ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కీసర డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు రామిడి స్వప్న విజయ్ రెడ్డి, కీసరగుట్ట ట్రస్ట్ బోర్డ్ మెంబర్ మొరుగు ముత్యాలు, , కీసరగుట్ట ట్రస్ట్ బోర్డు మెంబర్ ప్రవీణ్ కుమార్, కీసరగుట్ట ట్రస్ట్ బోర్డు మెంబర్ పొచబోయిన రాజు యాదవ్, తిమ్మాయిపల్లి గ్రామ అధ్యక్షుడు సురేష్, కాంగ్రెస్ నాయకులు ,శ్రీశైలం యాదవ్, కర్రె బిక్షపతి, దయర శ్రీను, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కౌన్సిలర్ ముత్యాలు గౌడ్ గృహప్రవేశం

## గృహ ప్రవేశంలో పాల్గొన్న డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్



**మేడ్చల్, జూలై 9(పీపుల్స్ డైరీ):-** సైబరాబాద్ కార్పొరేషన్ పరిధిలోని కిష్టాపూర్ డివిజన్ బ్రాడ్‌వేలో కౌన్సిలర్ ముత్యాలు గౌడ్ నూతన గృహప్రవేశ వేడుక గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మేడ్చల్--మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. గృహప్రవేశం సందర్భంగా వేదమంత్రాల నడుమ నిర్వహించిన ప్రత్యేక పూజల్లో వజ్రేష్ యాదవ్ పాల్గొన్నారు. అనంతరం నూతన గృహాన్ని సందర్శించి ముత్యాలు గౌడ్, అనిల్ గౌడ్ కుటుంబ సభ్యులను అభినందించారు. కొత్త ఇంటిలో సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు వెల్లివిరియాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ ప్రజలకు మరింత చేరువగా ఉంటూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, అభిమానులు, కాలనీవాసులు, కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన గృహప్రవేశ వేడుకను విజయవంతం చేశారు.

# రాక్ బాల్ క్రీడాకారుడు గోపాల్ యాదవ్ ను సన్మానించి ఎమ్మెల్యేలు



**మేడ్చల్ జూలై 09 (పీపుల్స్ డైరీ):-** దక్షిణాసియా రాక్‌బాల్ టోర్నమెంట్‌లో భారత జట్టు విజయానికి విశేషంగా కృషి చేసి దేశానికి కీర్తి తీసుకొచ్చిన మేడ్చల్ జిల్లా పూడూరు గ్రామానికి చెందిన జాతీయ క్రీడాకారుడు ఇటబోయిన గోపాల్ యాదవ్‌ను మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి,మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి గారు శాలువా కప్పి ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించి విజయంలో భాగస్వామి కావడం గర్వకారణమని అన్నారు. తెలంగాణ యువత క్రీడల్లో రాణిస్తూ దేశానికి పేరు ప్రతిష్ఠలు తీసుకురావడం ఎంతో ఆనందదాయకమని పేర్కొన్నారు. గోపాల్ యాదవ్ భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో విజయాలు సాధించి దేశానికి మరింత కీర్తి తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా గోపాల్ యాదవ్‌ను ప్రత్యేకంగా అభినందించి, ఆయన క్రీడా ప్రస్థానానికి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో కోచ్ లక్ష్మణ్, మాజీ జిల్లా గ్రంథాలయాల చైర్మన్ భాస్కర్ యాదవ్, బీఆర్ఎస్ అధ్యక్షులు దయానంద్ యాదవ్,మాజీ సర్పంచ్ బాబు యాదవ్, మాజీ కో ఆప్షన్ సభ్యులు నవీన్ రెడ్డి,మాజీ ఎంపీటీసీ రఘు, మాజీ వార్డు సభ్యులు కొల్ల వెంకటేష్, శేఖర్ రెడ్డి, యువకులు లక్ష్మణ్ యాదవ్,అనిల్ యాదవ్, పరమేశ్, సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

# మీసేవ కేంద్రాల్లో యూరియా బుకింగ్



**భూపాలపల్లి జూలై 09 పీపుల్స్ డైరీ :** రైతులకు అవసరమైన యూరియా ఎరువులను నకాలంలో అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మీ సేవా కేంద్రాల ద్వారా యూరియా బుకింగ్ సేవలను అందుబాటులోకి తీసు కొచ్చినట్లు ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ శ్రీకాంత్ తెలిపారు. రైతులు తమ సమీప మీ సేవా కేంద్రాలలో ముందస్తుగా యూరియాను బుక్ చేసుకోవాలని సూచించారు. యూరియా బుకింగ్ కోసం పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్,రిజిస్టర్డ్ మొబైల్ నంబర్ వివరాలు సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. యూరియా బుకింగ్ పూర్తి అయ్యాక ఐడీతో కూడిన రసీదు అందజేస్తారని ఆయన తెలిపారు. పోడు పట్టాలు కలిగిన రైతులు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన రూ.10 సేవా రుసుము చెల్లించి బుకింగ్ చేసుకోవాలని ఆయన సూచించారు. మొబైల్ నంబర్ మార్పు, కౌలు రైతుల నమోదు కోసం సంబంధిత రైతు వేదికలోని వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించాలని తెలిపారు. డిజిటల్ సంతకం పూర్తికాని భూముల పట్టాదారులు కూడా ఆధార్ ఆధారంగా యూరియా బుకింగ్ చేసుకునే అవకాశం కల్పించినట్లు ఆయన స్పష్టం చేశారు.

# విద్యార్థులతో కలిసి అల్పాహారం చేసిన జిల్లా కలెక్టర్ మను చౌదరి

- న్యూస్‌పేపర్ చదవడం అలవాటు చేసుకోవాలి స్టేజ్ ఫియర్‌ను అధిగమించాలని విద్యార్థులకు సూచన



**మేడ్చల్, జూలై 9(పీపుల్స్ డైరీ) మేడ్చల్ :** మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి గురువారం అల్వాల్ మండలంలోని కౌకూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులతో కలిసి అల్పాహారం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఆత్మీయంగా ముచ్చటిస్తూ చదువుతో పాటు వ్యక్తిత్వ వికాసానికి అవసరమైన అంశాలపై పలు సూచనలు చేశారు. విద్యార్థులు ప్రతిరోజూ తమ దినచర్యలో భాగంగా న్యూస్‌పేపర్ చదివే అలవాటు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. స్టేజ్ ఫియర్‌ను అధిగమించి, తమకు వచ్చిన భాషలోనే ధైర్యంగా వేదికపై మాట్లాడాలని, తద్వారా ఆత్మవిశ్వాసం పెరుగుతుందని చెప్పారు. అనంతరం పాఠశాలలో విద్యార్థుల సంఖ్య అందుబాటులో ఉన్న సౌకర్యాలపై హెడ్‌మాస్టర్ మురళీకృష్ణమూర్తిని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలకు అదనపు తరగతి గదులు అవసరమని హెడ్‌మాస్టర్ తెలియజేయగా, టాయిలెట్లు, తరగతి గదులు తదితర మౌలిక వసతులకు సంబంధించిన ప్రతిపాదనలు వెంటనే పంపించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని సైన్స్ ల్యాబ్, లైబ్రరీ, తరగతి గదులను పరిశీలించిన కలెక్టర్, విద్యార్థులు కోరిన క్రీడా సామగ్రిని అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకాదేవి, అల్వాల్ ఎంఆర్వో రాములు, హెడ్‌మాస్టర్ మురళీకృష్ణమూర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఆళ్లపల్లిలో అరుణోదయ నాగన్న సంతాపసభ



**ఆళ్ళపల్లి జూలై 9(పీపుల్స్ డైరీ) :** అరుణోదయ సాంస్కృతిక సేనాని, సిపిఐ(ఎం-ఎల్)న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకులు కామ్రేడ్ అరుణోదయ నాగన్న సంతాపసభ గురువారం ఆళ్లపల్లి మండల సెంటర్లో అరుణోదయ మండల అధ్యక్షులు కామ్రేడ్ పూనెం సత్యం అధ్యక్షతన జరిగింది. కామ్రేడ్ నాగన్న చిత్రపటానికి పూలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఐ ఎఫ్ టి యు జిల్లా అధ్యక్షులు కొక్కు సారంగపాణి,సిపిఐ (ఎం-ఎల్)న్యూ డెమొక్రసీ మండల కార్యదర్శి బట్టు ప్రసాద్,ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు పూనెం రంగయ్య మాట్లాడుతూ ప్రజా సాంస్కృతిక ఉద్యమానికి జీవితాన్ని అంకితం చేసిన విప్లవ గాయకుడు,పాటల ఊట కామ్రేడ్ అరుణోదయ నాగన్న ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు అర్పించే నిజమైన నివాళి అని అన్నారు. విలాసవంతమైన జీవితాన్ని గడిపే అవకాశాలు ఉన్నప్పటికీ వాటన్నింటినీ తృణప్రాయంగా తిరస్కరించి పేద ప్రజల పక్షాన నిలబడిన మహోన్నత వ్యక్తి కామ్రేడ్ నాగన్న అని వారు కొనియాడారు. ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని స్వయంగా గత ప్రభుత్వం ఆహ్వానించినా, ప్రజల మధ్యే ఉండి వారి సమస్యల పరిష్కారం కోసం పోరా డాలనే సంకల్పంతో ఆ అవకా శాన్ని సున్నితంగా తిరస్కరించిన అరుదైన విప్లవకా రుడని పేర్కొన్నారు. నాగన్న తన జీవితాన్నే కాదు, తన కుటుంబాన్నీ ప్రజా ఉద్యమాలకు అంకితం చేసిన ఆదర్శవంతుడని అన్నారు. రైతులు, కూలీలు, అణగారిన వర్గాల బాధలను తన పాటల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లి, ప్రజా చైతన్యాన్ని రగిలించిన సాంస్కృతిక యోధుడిగా ఆయన చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు. నాగన్న భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన పాటలు, ఆశయాలు,ప్రజల కోసం సాగించిన పోరాట స్ఫూర్తి ఎల్లప్పుడూ ప్రజా ఉద్యమాలకు దిక్సూచిగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఆయన చూపిన మార్గంలో నడుస్తూ పేద ప్రజల హక్కుల సాధన కోసం మరింత పట్టుదలతో ఉద్యమాలను కొనసాగించడమే నాగన్నకు అందించే గొప్ప నివాళి అని అన్నారు. జులై 11న ఇల్లెందులో నిర్వహించే నాగన్న సంస్మరణ సభకు ప్రజలు, కళాకారులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవ ంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసి మండల నాయకులు మెస్సు గోపాల్, బొర్ర వెంకన్న,అటికం శేఖర్,బత్తిని సత్యం, ఎనగంటి లాజర్, బొమ్మెర్ల వీరన్న, పూనెం మంగ,తోట వీరభద్ర,పూనెం రమేష్,పూనెం బత్కయ్య తదితరులు పాల్గొన్నారు.

# మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా డీఎంహెచ్‌వోగా డా.కె.ఆనంద్ బాధ్యతల స్వీకరణ

- జిల్లా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలే లక్ష్యం: డా.కె.ఆనంద్



**మేడ్చల్, జూలై 9(పీపుల్స్ డైరీ):-** తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ డీఎంహెచ్‌వో ఇన్‌చార్జిగా డా.కె. ఆనంద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వం జి.ఓ.ఆర్.టి. నెం.293, హెచ్ఎమ్ & ఎఫ్‌డబ్ల్యూ (బి) శాఖ, తేదీ 08-07-2026 ప్రకారం, ఇప్పటివరకు డీఎంహెచ్‌వోగా పనిచేసిన డా. సి. ఉమా గౌరిని పరిపాలనా కారణాల దృష్ట్యా రిలీవ్ చేసి ప్రజారోగ్య మరియు కుటుంబ సంక్షేమ సంచాలకుల కార్యాలయం, హైదరాబాద్‌లో రిపోర్ట్ చేయాలని ఆదేశించింది. అదే ఉత్తర్వుల మేరకు నిలోఫర్ ఆసుపత్రిలో సివిల్ సర్జన్--ఆర్ఎంఓగా పనిచేస్తున్న డా. కె. ఆనంద్‌ను మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా డీఎంహెచ్‌వో ఇన్‌చార్జిగా నియమించింది. బాధ్యతలు స్వీకరించిన అనంతరం డా. ఆనంద్ జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ మను చౌదరి ఐఏఎస్, అదనపు కలెక్టర్ యూఎల్‌బీ ఫైజాన్ అహ్మద్ ఐఏఎస్, అదనపు కలెక్టర్ రెవెన్యూ విజయేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డా. ఆనంద్ మాట్లాడుతూ జిల్లాలో ప్రజలకు నాణ్యమైన వైద్య, ఆరోగ్య సేవలు అందించడం తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజారోగ్య కార్యక్రమాలు, జాతీయ ఆరోగ్య పథకాలు, మాతా--శిశు సంక్షేమ పథకాల అమలును మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. డా. కె. ఆనంద్‌కు మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాలో ప్రజారోగ్య పరిపాలనలో విశేష అనుభవం ఉంది. గతంలో మల్కాజిగిరి డివిజన్ డిప్యూటీ జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారిగా, మేడ్చల్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్‌గా, జిల్లా మాతాశిశు సంక్షేమ కార్యక్రమం మరియు నేషనల్ హెల్త్ మిషన్ జిల్లా అధికారిగా సమర్థవంతంగా సేవలందించారు. జిల్లాలోని ఆరోగ్య వ్యవస్థ, ప్రజారోగ్య కార్యక్రమాల అమలుపై ఆయనకు విస్తృత అనుభవం ఉండటం విశేషం.

# ప్రభుత్వ పాఠశాలల మూసివేత నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలి

- విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయండి
- సోతుకు ప్రవీణ్ కుమార్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు



**భూపాలపల్లి జూలై 09 పీపుల్స్ డైరీ :** భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి ఈనెల జూలై 10వ తేదీన జరిగే రాష్ట్రస్థాయి విద్యాసంస్థల బంద్‌కు సంబంధించిన గోడపత్రికలను ఆవిష్కరించారు. జయప్రదఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సోతుకు ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు పూర్తవుతున్నప్పటికీ రాష్ట్ర విద్యారంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని తీవ్ర స్థాయిలో విమర్శించారు. విద్యాశాఖను ముఖ్యమంత్రి స్వయంగా పర్యవేక్షిస్తున్నామని చెప్పుకుంటున్నా, విద్యార్థుల సమస్యలు మాత్రం ఎక్కడా పరిష్కారం కాకపోవడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని అన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న డీఈవో, ఎంఈవో, ఉపాధ్యాయులు, నాన్-టీచింగ్ పోస్టులను భర్తీ చేయకుండా విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌలిక వసతులు కల్పించడంలో కూడా ప్రభుత్వం పూర్తిగా చేతులెత్తేసిందని ఆరోపించారు. ప్రైవేటు పాఠశాలల్లో ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ఫీజుల దోపిడీని అరికట్టకుండా కార్పొరేట్ విద్యాసంస్థలకు ప్రభుత్వం కొమ్ముకాస్తోందని విమర్శించారు. ఎన్నికల ముందు విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రేవంత్ రెడ్డి ప్రభుత్వం విద్యార్థులను మోసం చేసిందని ఆరోపించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో విద్యార్థులు లేరనే సాకుతో ఏకంగా 36 ప్రభుత్వ పాఠశాలలను మూసివేయాలనే నిర్ణయం అత్యంత దురదృష్టకరమైనదే కాక ప్రజా విద్యపై ప్రత్యక్ష దాడి అని పేర్కొన్నారు. పాఠశాలలను మూసివేయడం ప్రభుత్వ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునే ప్రయత్నమని అన్నారు. విద్యార్థులను తిరిగి పాఠశాలలకు చేర్చే బాధ్యత ప్రభుత్వానిదే తప్ప, పాఠశాలలను మూసివేయడం కాదన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులు డ్రాప్‌అవుట్ అయిన విద్యార్థులను గుర్తించి, వారి తల్లిదండ్రులతో ప్రత్యేకంగా మాట్లాడి మళ్లీ అడ్మిషన్లు చేపట్టి ప్రభుత్వ పాఠశాలలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు, యువజన సంఘాలు, ప్రజాసం ఘాలతో కలిసి జిల్లావ్యాప్తంగా ఉధృత ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరి ంచారు. ఈ కార్యక్రమం లో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నేరెళ్ల జోసెఫ్, బల్లెం రాజ్ కుమార్, హమీద్, బన్నీ, కిరణ్ అశోక్ నవీన్ కళ్యాణ్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల సమస్యల పరిష్కారానికి విద్యాసంస్థల బంద్ ఎస్ఎఫ్ఐ పిలుపు



**మేడ్చల్, జూలై 9(పీపుల్స్ డైరీ):-** విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం జూలై 10న ఎస్ఎఫ్ఐతో పాటు వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ మేడ్చల్ జిల్లా కమిటీ సభ్యులు వినయ్ పిలుపునిచ్చారు. ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసే విధానాలను విరమించుకోవాలని, ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత, కనీస మౌలిక వసతుల లేమి, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిలు విడుదల కాకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, తాగునీరు, మరుగుదొడ్లు, తరగతి గదులు, ఫర్నిచర్, విద్యుత్ వంటి మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల అక్రమ ఫీజు వసూళ్లను అరికట్టడంతో పాటు, విద్యార్థులకు రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని కోరారు. ప్రైవేట్ పాఠశాలలు పుస్తకాలు, యూనిఫాంలు, స్టేషనరీ, రవాణా పేర్లతో అదనపు వసూళ్లు చేస్తున్నాయని, వాటిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేస్తూ ప్రతి విద్యార్థికి నాణ్యమైన ఉచిత విద్య అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం చేపడుతున్న జూలై 10 విద్యాసంస్థల బంద్‌లో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ మేడ్చల్ జిల్లా కమిటీ సభ్యులు వినయ్ విజ్ఞప్తి చేశారు.

# కళాశాల సమయాలకు అనుగుణంగా బస్సులు నడపాలి

- అవసరమైతే అదనపు బస్సులు ఏర్పాటు చేయాలి: ఎస్ఎఫ్ఐ నాయకులు



**మేడ్చల్, జూలై 9(పీపుల్స్ డైరీ):** జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో చదువుతున్న వేలాది మంది విద్యార్థుల ప్రయాణ ఇబ్బందులను పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కమిటీ సంబంధిత ఆర్టీసీ డిపో మేనేజర్‌కు గురువారం వినతిపత్రం అందజేసింది. కళాశాలల సమయాలకు అనుగుణంగా బస్సులు నడపడంతో పాటు అవసరమైతే అదనపు బస్సులను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి కార్తీక్ మాట్లాడుతూ, కళాశాలలు సాయంత్రం 4:30 గంటలకు ముగుస్తుండగా సంబంధిత గ్రామాలకు వెళ్లే బస్సు 4:10 గంటలకే బయలు దేరుతుండటంతో విద్యార్థులు దానిని అందుకోలేకపోతున్నారని తెలిపారు. అనంతరం వచ్చే బస్సు 5:30 గంటలకు మాత్రమే ఉండటంతో గంటకుపైగా బస్‌స్టాండ్‌లో వేచి ఉండాల్సి వస్తోందన్నారు. ఆ బస్సు కూడా ఆలస్యంగా ప్రధాన బస్‌స్టేషన్‌కు చేరుకోవడంతో అక్కడి నుంచి మరో బస్సు లేదా ఇతర వాహనాల్లో గ్రామాలకు వెళ్లాల్సి రావడం వల్ల విద్యార్థులు రాత్రి వేళల్లోనే ఇళ్లకు చేరుకుంటున్నారని చెప్పారు. ముఖ్యంగా విద్యార్థినులు చీకటి పడిన తర్వాత దూర గ్రామాలకు వెళ్లాల్సి రావడం భద్రతాపరంగా ఆందోళన కలిగిస్తోందని పేర్కొన్నారు. ఆలస్యంగా ఇంటికి చేరుకోవడం వల్ల తల్లిదండ్రులు ఆందోళన చెందడంతో పాటు విద్యార్థుల చదువుకు కేటాయించాల్సిన సమయం ప్రయాణం లోనే వృథా అవుతోందన్నారు. కనుకుంట, వీరారెడ్డిపల్లి, మైసిరెడ్డిపల్లి, కొనాయిపల్లి, డబిల్‌పూర్, నూత న్‌కల్, కొండాపూర్, ముప్పిరెడ్డిపల్లి తదితర గ్రామాల విద్యార్థులు ఈ సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రతి సంవత్సరం విద్యార్థుల నుంచి బస్‌పాస్‌ల రూపంలో ఆర్టీసీ భారీ మొత్తంలో రుసుములు వసూలు చేస్తున్నప్పటికీ, వారి అవసరాలకు అనుగుణంగా బస్సులు నడపడంలో నిర్లక్ష్యం వహించడం సరికాదని ఎస్ఎఫ్ఐ నాయకులు విమర్శిం చారు. కళాశాలలు ముగిసే సమయానికి అనుగుణంగా సాయంత్రం 4:45 లేదా 5:00 గంటలకు బస్సులను నడపాలని, అవసరమైతే ప్రత్యేక అదనపు బస్సులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యను వెంటనే పరిష్కరించకపోతే విద్యార్థులతో కలిసి ఆర్టీసీ కార్యాలయం ఎదుట ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరిం చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు వినయ్, సాయి, రాజాతో పాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

# విధులకు ఆటంకం కల్పించి బైక్ దోచుకున్న ముగ్గురు అరెస్ట్

- జమ్మికుంట లో ఇసుక మాఫియా హల్చల్.
- అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట..
- జమ్మికుంట పోలీసుల చాకచక్యం..
- అపహరించిన బైక్‌తో పాటు నేరానికి ఉపయోగించిన రెండు వాహనాలు స్వాధీనం



**జమ్మికుంట, జూలై 08పీపుల్స్ డైరీ :** అక్రమ ఇసుక రవాణాను అరికట్టే క్రమంలో విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందికి ఆటంకం కల్పించి, ఓ వ్యక్తిపై దాడి చేసి అతని మోటార్ సైకిల్‌ను బలవంతంగా అపహరించిన ఘటనలో జమ్మికుంట పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. అపహరించిన మోటార్ సైకిల్‌తో పాటు నేరానికి ఉపయోగించిన రెండు ద్విచక్ర వాహనాలను కూడా స్వాధీనం చేసుకున్నారు. జిల్లా పోలీసు అధికారుల ఆదేశాల మేరకు జమ్మికుంట పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమ ఇసుక రవాణాను అరికట్టేందుకు కొరపల్లి గ్రామ సమీపంలో ప్రత్యేక చెక్‌పోస్ట్ ఏర్పాటు చేసి పోలీసులు విధులు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో అక్రమ ఇసుక రవాణా చేస్తున్న కొందరు వ్యక్తులు తమ కార్యకలాపాలకు ఆటంకం కలుగుతోందనే ఉద్దేశంతో జూలై 6 రాత్రి చెక్‌పోస్ట్ వద్దకు చేరుకుని విధుల్లో ఉన్న హోంగార్డు, ఏఆర్ కానిస్టేబుల్‌తో గొడవకు దిగినట్లు దర్యాప్తులో తేలింది. అదే సమయంలో అక్కడ జరుగుతున్న ఘటనను వీడియో తీస్తున్న దొగ్గల రాజు అనే వ్యక్తిని లక్ష్యంగా చేసుకున్న నిందితులు అతడిని వెంబడించి వెంకటేశ్వర్లపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం సమీపంలో అడ్డగించి దాడి చేశారు. అనంతరం అతని వద్ద ఉన్న మోటార్ సైకిల్‌ను బలవంతంగా లాక్కొని పరారయ్యారు. తర్వాత ఆ వాహనాన్ని విలాసాగర్ గ్రామ శివారులోని ఎస్టీ కాలనీ సమీపంలోని పొదల్లో వదిలివేసినట్లు విచారణలో వెల్లడైంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన జమ్మికుంట పోలీసులు ప్రత్యేక దర్యాప్తు చేపట్టారు. జూలై 7 ఉదయం జమ్మికుంట--కొరపల్లి రోడ్డులోని సైదాబాద్ రోడ్డు వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో అనుమానాస్పదంగా పారిపోవడానికి ప్రయత్నించిన ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో వారు నేరాన్ని అంగీకరించారు.

**అరెస్టైన నిందితులు:**

రాచపల్లి ప్రశాంత్ (27), విలాసాగర్ గ్రామం రాచపల్లి సమ్మయ్య (58), విలాసాగర్ గ్రామం రాచపల్లి రాజు (41), విలాసాగర్ గ్రామం నిందితుల సమాచారం మేరకు అపహరించబడిన మోటార్ సైకిల్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే నేరానికి ఉపయోగించిన పల్సర్ 150 సీసీ మోటార్ సైకిల్ (రిజిస్ట్రేషన్ నం. టీజీ-02-ఏ-5079), హీరో స్ప్లెండర్ ప్లస్ మోటార్ సైకిళ్లను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో పరారీలో ఉన్న ఇతర నిందితుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని పోలీసులు తెలిపారు. నేరాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, అరెస్టైన నిందితులపై రౌడీ షీట్ తెరిచే ప్రక్రియ కూడా చేపడతామని జిల్లా పోలీసులు హెచ్చరించారు.

# కల్తీ నూనెలు, సింగిల్-యూజ్ ప్లాస్టిక్ వినియోగిస్తే కఠిన చర్యలు

**మున్సిపల్ కమిషనర్ జి. మల్లికార్జున స్వామి**



**జమ్మికుంట, జూలై 09 పీపుల్స్ డైరీ :** జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, టీ స్టాళ్లు, బజ్జీ బండ్లు, తోపుడు బండ్ల నిర్వాహకులతో పాత మున్సిపల్ కార్యాలయంలో అవగాహన సమావేశం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ శ్రీ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ శ్రీ జి. మల్లికార్జున స్వామి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఆహార పదార్థాల తయారీలో ఎట్టి పరిస్థితుల్లోనూ కల్తీ నూనెలు లేదా పలుమార్లు వాడిన వంట నూనెను ఉపయోగించరాదని సూచించారు. పామాయిల్‌కు బదులుగా డబుల్ ఫిల్టర్ పల్లి నూనె లేదా సన్‌ఫ్లవర్ నూనె వంటి నాణ్యమైన వంట నూనెలను మాత్రమే వినియోగించాలని తెలిపారు. సింగిల్-యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిలిపివేయాలని ఆదేశించారు. ప్లాస్టిక్ ప్లేట్లు, ప్లాస్టిక్ గ్లాసులు, ప్లాస్టిక్ కవర్లలో టిఫిన్లు ఇవ్వకూడదని, ఆకులు లేదా పర్యావరణహిత పాత్రల్లో మాత్రమే ఆహారాన్ని అందించాలని సూచించారు. టీ స్టాళ్లలో టీని గాజు లేదా స్టీల్ గ్లాసుల్లో మాత్రమే అందించాలని తెలిపారు. వారం రోజుల తర్వాత ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తామని, ప్లాస్టిక్ ప్లేట్లు, ప్లాస్టిక్ గ్లాసులు లేదా ఇతర నిషేధిత ప్లాస్టిక్ వస్తువులు వినియోగిస్తున్నట్లు గుర్తిస్తే రూ. 1,000 నుంచి రూ. 2,000 వరకు జరిమానా విధించడంతో పాటు నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా బజ్జీ బండ్లు, హోటళ్ల నిర్వాహకులు తప్పనిసరిగా చేతులకు గ్లౌజులు, తలకు హెడ్ క్యాప్, ముఖానికి మాస్క్ ధరించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ పరిశుభ్రమైన ఆహారాన్ని వినియో గదారులకు అందించాలని సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ మేనేజర్ జి. రాజిరెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఐ. రమేష్, సదానందం, హోటల్ యజ మానులు, బజ్జీ బండ్ల నిర్వాహకులు, తోపుడు బండ్ల వ్యాపా రులు తదితరులు పాల్గొన్నారు.



# రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను వెంటనే ఉపసంహరించాలి

- కేంద్ర--రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలి: సీఐటీయూ, రైతు సంఘం




**హుజూరాబాద్, జూలై 9 (పీపుల్స్ డైరీ) :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న రైతు, కార్మిక, వ్యవసాయ కార్మిక వ్యతిరేక విధానాలను వెంటనే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ, తెలంగాణ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ప్రజా వ్యతిరేక విధానాలపై ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. గురువారం హుజూరాబాద్‌లోని సీఐటీయూ కార్యాలయంలో సీఐటీయూ, తెలంగాణ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల మండల సంయుక్త సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్, తెలంగాణ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చెల్పూరి రాము మాట్లాడుతూ, రైతులకు తీవ్ర నష్టం కలిగించే వ్యవసాయ విద్యుత్ మూడో డిస్కం (థర్డ్ డిస్కం) ప్రతిపాదనను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ విద్యుత్‌ను కార్పొరేట్ సంస్థల చేతుల్లోకి నెట్టే చర్యలను రైతాంగం ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించదని స్పష్టం చేశారు. కార్మికుల హక్కులను పరిరక్షించే లేబర్ కోర్టులను రద్దు చేయాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకుని, వాటిని యథావిధిగా కొనసాగించాలని కోరారు. కార్మికుల న్యాయపరమైన హక్కులను బలహీనపరిచే చర్యలను ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే వీబీజీ రాంజీ పథకాన్ని రద్దు చేసి, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని (ఎంఎన్‌ఆర్‌ఈజీఎస్) యథాతథంగా కొనసాగించాలని కోరారు. ఉపాధి హామీ పథకం గ్రామీణ పేదలకు జీవనాధారమని, దానిని బలహీనపరిచే ప్రయత్నాలను వెంటనే నిలిపివేయాలని అన్నారు. రైతులు, కార్మికులు, వ్యవసాయ కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చిన నాయకులు, ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక నిర్ణయాలను వెనక్కి తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీఐటీయూ మండల కన్వీనర్ కదిరే రమేష్, దండిగారి సతీష్, ఇమ్మడి దేవయ్య, కొడిమెల వెంకటేష్, ఆకునూరి సుధాకర్, శనిగరపు కొమురయ్య, నవీన్, శ్రీకాంత్, ఉమా, మాట్ల చిరంజీవి, మహేష్, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

# మొక్కలు నాటిన మున్సిపల్ చైర్మన్ శ్రీ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్



**జమ్మికుంట. జులై 09పీపుల్స్ డైరీ :** జమ్మికుంట పట్టణ పరిధిలోని ఆబాది జమ్మికుంటలో వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటిన మున్సిపల్ చైర్మన్ శ్రీ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ మాట్లాడుతూ ఆబాదిలో ప్రతి ఇంటికి చుట్టుపక్కల చాలా కాలి ప్రదేశాలు ఉంటాయి కనుక ప్రతిఒక్కరు భాగస్వాములై వారి వారి ఇంటి ఆవరణంలో మొక్కలు నాటి ఇతరులకు ఆదర్శంగా నిలవాలని మన ఇంటి చుట్టూ మొక్కలు నాటడం ద్వారా మన కుటుంబసభ్యులు ఆరోగ్యంగా ఉంటారని అలాగే చుట్టుపక్కల వారికి కూడా ఉపయోగపడేలా కూడా ఉంటుందని వర్షాలు సకాలంలో కురవాలన్న చెట్లు అవసరం అని తెలిపారు ఈ కార్యక్రమంలో కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి కౌన్సిలర్స్ ఎగిత సుజాత అశోక్, మైస శిరీష రవి,గణేష్,బిక్షపతి వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# సీఐ పులి వెంకట్ జన్మదిన వేడుకలు

**తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా కార్యదర్శి దాట్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సీఐ పులి వెంకట్ కు ఘన సన్మానం.**



**జమ్మికుంట. జూలై 09, పీపుల్స్ డైరీ :** జమ్మికుంట రూరల్ సీఐ పులి వెంకట్ జన్మదిన సందర్భంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా కార్యదర్శి దాట్ల శ్రీనివాస్ ఆధ్వర్యం లో ఘనంగా సన్మానించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియ జేశారు. ఈ సందర్భంగా దాట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ, చట్టానికి ప్రతినిధిగా తన వృత్తి ధర్మాన్ని నిర్వర్తిస్తూ సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయాన్ని అందిస్తూ, తన వృత్తికి వన్నె తీసుకొని రావాలని కోరినారు. అదే విధంగా సమాజంలోని ముఖ్యంగా బడుగు బలహీన అట్టడుగు వర్గాల ప్రజలకు తన సేవలు అందుబాటులో ఉండునట్లు విధిని నిర్వహిస్తూ అన్ని వర్గాల ప్రజలందరి ఆదరాభిమానాన్ని చురగొని రాష్ట్రంలోనే ఒక ఉన్నత పోలీస్ అధికారిగా ఎదగాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొని మంచి అధికారిగా పేరు పొందాలని కోరుతూ జన్మదిన శుభాకాంక్షలు తెలియ జేయడం జరిగినది.

# వివాహ వేడుకకు హాజరైన...

**వొడితల ప్రణవ్ బాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ సుహాసిని**



**హుజూరాబాద్, జూలై 9, (పీపుల్స్ డైరీ) :** హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ బాబు, హుజూరాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని మనోజ్ రావు గురువారం పట్టణంలోని 24వ వార్డులో జరిగిన గంట మౌనిక వెంకటేష్ వివాహ వేడుకకు హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వ దించి, వారి దాంపత్య జీవితం ఆనందంగా, ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో కొనసాగాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత మొబైల్ ఎక్స్‌రే హెల్త్ క్యాంప్



**శంకరపట్నం జులై :09 పీపుల్స్ డైరి:** మండలం లోని మొలంగూర్ గ్రామం లో ప్రజల ఆరోగ్య రక్షణే ధ్యేయంగా మొలంగూర్ గ్రామంలో గురువారం రోజున ఉచిత మెగా ఎక్స్‌రే హెల్త్ క్యాంప్‌ను నిర్వహించారు. గ్రామస్తుల ఆరోగ్య అవసరాలను గుర్తించి ఏర్పాటు చేసిన ఈ శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ పూదరి రాజు ఉప సర్పంచ్ దండు రాకేష్ మరియు వార్డు సభ్యులు జిల్లా టీబీ నియంత్రణ అధికారి డాక్టరు హిమ బిందు , జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఉమ్మశ్రీ, హాజరై, క్యాంపును జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. వైద్య సేవలు పర్యవేక్షణశంకరపట్నం మెడికల్ ఆఫీసర్ గొట్టే శ్రవణ్ కుమార్ ఆధ్వర్యంలో రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఎక్స్‌రే తీసి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ హిమబిందు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలు ఆరోగ్య సమస్యల పట్ల నిర్లక్ష్యం వహించకుండా, ఎఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం లో హెల్త్ క్యాంప్‌లో హెల్త్ సూపర్‌వైజర్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, అనిల్ మీనా ఏఎన్ఎం నరసమ్మ మరియు స్థానిక ఆశా వర్కర్లు, ఇంపాక్ట్ ఇండియా ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ రాజ బోసు, ఎదీఎం నిశాంతు పాల్గొని రోగులకు సేవలందించారు. గ్రామ ప్రజలకు వైద్య పరీక్షలు సజావుగా సాగేలా వీరంతా దగ్గరుండి పర్యవేక్షించారు. ఉచితంగా ఎక్స్‌రే మరియు వైద్య సేవలు అందించినందుకు మొ లంగురు గ్రామ ప్రజలు వైద్య బృందానికి మరియు గ్రామ ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

పీపుల్స్ డైరీ
వరంగల్
శుక్రవారం, 10 జూలై 2026
సంపుటి : 18, సంచిక : 124


## వాటర్ ప్లాంట్ నిర్మాణానికి శంకుస్థాపన

### సర్పంచ్ మండల కుమార స్వామి



**వీణవంక జులై 09( పీపుల్స్ డైరీ) :** బ్రాహ్మణపల్లి గ్రామ ప్రజల ఆరోగ్యానికి, తాగునీటి ఇబ్బందులను దూరం చేయడానికి గ్రామ సర్పంచ్ మండల కుమారస్వామి కీలక అడుగు వేశారు. ఎన్నికల సమయంలో గ్రామ ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ, గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న వాటర్ ప్లాంట్ నిర్మాణానికి ఆయన శాస్త్రోక్తంగా శంకుస్థాపన (భూమి పూజ) చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి ఒక్కరికీ స్వచ్ఛమైన, సురక్షితమైన తాగునీరు అందించాలనే ఉద్దేశంతోనే ఈ వాటర్ ప్లాంట్ పనులను ప్రారంభించామని, ఇచ్చిన మాట ప్రకారం నిర్ణీత కాలంలోనే దీనిని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు మెంబర్లు, గ్రామ పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని సర్పంచ్ ను అభినందించారు.

## పశువులకు (లంపి స్కిన్) టీకాల పంపిణీ



**భీమదేవరపల్లి జూలై 9 (పీపుల్స్ డైరీ ) :** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం గట్లనర్సింగాపూర్ గ్రామంలో గురువారం (పశువులకు (లంపి స్కిన్) టీకాల పంపిణీ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ బొల్లంపల్లి అజయ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, పశువులకు ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా ముందుజాగ్రత్తగా ఈ టీకాల కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. గ్రామంలోని పాడి రైతులందరూ తమ పశువులను స్థానిక పశువైద్యశాల వద్దకు తీసుకువచ్చి తప్పనిసరిగా టీకాలు వేయించుకోవాలని ఆయన సూచించారు. అనంతరం జూనియర్ మహిళా పశువైద్యురాలు డి. నాగారాణి మాట్లాడుతూ, గ్రామంలోని పశువులకు ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తినా వెంటనే తమకు ముందస్తు సమాచారం అందించాలని కోరారు. పాడిరైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, అన్ని రకాల పశువులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ బొడిగె శ్రీనివాస్ గౌడ్, పాడిరైతు రామంచ అశోక్, స్థానిక రైతులు పాల్గొన్నారు

## నర్సింగాపూర్ లో ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్స్ పంపిణీ చేసిన సర్పంచ్ రమేష్



**వీణవంక జులై 09( పీపుల్స్ డైరీ) :** నర్సింగాపూర్ గ్రామం లో వొడితల ప్రణవ్ బాబు ఆదేశాల మేరకు ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్స్ ఇవ్వడం జరిగింది. శివరాత్రి యాదమ్మ, శ్రావణపెల్లి శ్వేత, రాచర్ల సప్న ఈకార్యక్రమంలో మండల్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గంగాడి రాజిరెడ్డి, మండల యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ పోతరవేన సతీష్ కుమార్, ఇందిరమ్మ కమిటీ మెంబర్లు సింగిరెడ్డి రమ, సమ్మిరెడ్డి, కండె మహేందర్ గ్రామ కార్యదర్శి ఓర్సు సురేష్, వార్డ్ మెంబర్లు ఉయ్యాల శ్రీకాంత్, శేఖర్, తిరుపతి కాంగ్రెస్ నాయకులు సబ్బని శ్రీనివాస్, తాటికంటి తిరుపతి పాల్గొన్నారు

## జాతీయ రహదారికి వెళ్లాలంటే రోడ్డు డ్రైనేజీ దుర్భర పరిస్థితి



**మేడ్చల్, జూలై 9(పీపుల్స్ డైరీ):** జాతీయ రహదారి--44 పక్కన ఉన్న అయ్యప్ప స్వామి కమాన్ వద్ద గత కొన్ని రోజులుగా డ్రైనేజీ పొంగిపొర్లి మురుగు నీరు రోడ్డుపైకి చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతిరోజూ బస్ డిపో, పాఠశాలలు, కార్యాలయాలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు, అయ్యప్ప స్వామి ఆలయానికి వచ్చే భక్తులు ఈ మార్గాన్ని వినియోగిస్తుండగా, రోడ్డుపై నిలిచిన మురుగు నీటితో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. డ్రైనేజీ నీరు రోడ్డంతా వ్యాపించి దుర్వాసన వెదజల్లుతుండటంతో స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ద్విచక్ర వాహనదారులు జారిపడే ప్రమాదం ఉందని, పాదాచారులు మురుగు నీటిని దాటేందుకు నానా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటి వరకు ఎలాంటి శాశ్వత చర్యలు చేపట్టలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. వర్షాలు కురిసే సమయంలో పరిస్థితి మరింత దారుణంగా మారుతోందని, అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం కూడా ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల డిమాండ్: ప్రజారోగ్యం, రహదారి భద్రత దృష్ట్యా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి డ్రైనేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని, మురుగు నీరు రోడ్డుపైకి రాకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## హుజూరాబాద్‌లో విషాదం:చేపలు పట్టేందుకు వెళ్లిన మత్స్యకారుడు దుర్మరణం



**హుజూరాబాద్, జూలై 9 (పీపుల్స్ డైరీ):** చేపలు పట్టేందుకు వెళ్లిన ఓ మత్స్యకారుడు ప్రమాదవశాత్తు చెరువులో మునిగి మృతి చెందడంతో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. భార్య, పిల్లల కళ్లెదుటే ఈ ఘటన జరగడం కుటుంబ సభ్యులను కన్నీరుమున్నీరుగా ముంచెత్తింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం, కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం చెల్పూర్ గ్రామ శివారులోని పెద్ద చెరువులో గురువారం ఉదయం సుమారు 50 మంది మత్స్యకారులు చేపల వేటకు వెళ్లారు. ఈ సందర్భంగా చెల్పూర్ గ్రామానికి చెందిన ఈర్ల రవీందర్ (48) కాలికి ఉన్న బేడి వలకు చిక్కుకోవ డంతో నీటిలో మునిగిపోయాడు. సమీపంలో ఉన్న ఇతర మత్స్యకారులు వెంటనే అతడిని నీటిలో నుంచి బయటకు తీసి ప్రాథమిక చికిత్స అందించి 108 అంబులెన్స్ ద్వారా హుజూరాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే ఆసుపత్రిలో పరీక్షించిన వైద్యులు అప్పటికే రవీందర్ మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటన సమయంలో అతని భార్య, పిల్లలు కొంత దూరంలోనే ఉండగా, వారి కళ్లెదుటే ఈ విషాదం జరగడంతో కుటుంబ సభ్యుల రోదనలు అందరినీ కలిచివేశాయి మృతుడికి భార్య రజిత, ముగ్గురు కుమారులు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి దర్యాప్తు చేపట్టారు.

## శాంతిభద్రతల పరిరక్షణకు 'సీసీ కెమెరాల' నిఘా అత్యంత కీలకం

- కమిషనరేట్ వ్యాప్తంగా మరో 700 కెమెరాల ఏర్పాటు లక్ష్యం
- యువత డ్రగ్స్, సైబర్ గేమింగ్ అలవాట్లకు దూరంగా ఉండి క్రీడలపై దృష్టి సారించాలి
- కరీంనగర్ సీపీ గౌష్ ఆలం

**జమ్మికుంట:జులై 09పీపుల్స్ డైరీ :** శాంతిభద్రతల పరిరక్షణలో మరియు నేరాల నియంత్రణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ముఖ్యంగా సీసీటీవీ కెమెరాల పాత్ర అత్యంత కీలకమని కరీంనగర్ పోలీస్ కమిషనర్ (సీపీ)





గౌష్ ఆలం, ఐపీఎస్ పేర్కొన్నారు. హుజురాబాద్ డివిజన్ పరిధిలోని సైదాబాద్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన 16 సీసీ కెమెరాలను, కొరపల్లి గ్రామంలోని 05 సీసీ కెమెరాలను ఆయన గురువారం ప్రారంభించారు. అనంతరం జమ్మికుంట పట్టణ మరియు రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్ విజేతలకు సీపీ జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా జమ్మికుంటలోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో విద్యార్థులు, ఆటో డ్రైవర్లు, ప్రజలతో ఏర్పాటు చేసిన విస్తృత అవగాహన సదస్సులో సీపీ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

### పోలీస్ కమిషనర్ మాట్లాడిన ముఖ్యాంశాలు

సీసీటీవీల విస్తరణ:లి ప్రతి గ్రామం, పట్టణం మరియు కరీంనగర్ కమిషనరేట్ పరిధిలోని ప్రతి మూలను సీసీటీవీ నిఘా నీడలోకి తీసుకురావడమే పోలీసుల ముఖ్య ఉద్దేశం. రాబోయే రోజుల్లో కమిషనరేట్ పరిధిలో మరో 700 కొత్త కెమెరాలను అమర్చడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. సైబర్ నేరాలు – ఆన్‌లైన్ గేమింగ్ ముప్పు:లి ప్రస్తుతం సమాజంలో పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ముఖ్యంగా చిన్న పిల్లలు, యువత ఆన్‌లైన్ గేమింగ్ బారిన పడి డబ్బులు నష్టపోవడమే కాకుండా ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. కరీంనగర్ జిల్లాలోనూ ఇలాంటి ఘటనలు వెలుగుచూస్తున్నాయి. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై నిరంతరం నిఘా ఉంచాలి. మత్తు పదార్థాల నిర్మూలన:లి యువత తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసే డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి. గ్రామీణ ప్రాంతాల్లో వీటి సరఫరా లేదా వాడకంపై సమాచారం ఉంటే వెంటనే స్థానిక పోలీసులకు లేదా 'డయల్ 100' కు సమాచారం అందించాలి. యువత మత్తుకు బానిస కాకుండా క్రీడలపై దృష్టి సారించాలి. రోడ్డు భద్రత – రహవీర్ పథకం:లి వాహనదారులు, ప్రయా ణికులు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు



పాటించాలి. రోడ్డు ప్రమాద బాధితులను సకాలంలో ఆసుపత్రికి చేర్చి వారి ప్రాణాలు కాపాడే వారికి ప్రభుత్వం లి'రహవీర్ పథకం'లి కింద రూ. 25,000 నగదు పురస్కారం అందిస్తుంది. ఈ విషయాన్ని ప్రజలందరూ గమనించాలి. సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన సైదాబాద్ సర్పంచ్ రాజారామ్, కొరపల్లి సర్పంచ్ మధు-సూదన్, స్థానిక ప్రజాప్రతిని ధులకు, గ్రామ ప్రజలకు సీపీ ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ ఏసీపీ మాధవి, జమ్మికుంట సర్కిల్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ, జమ్మికుంట రూరల్ ఇన్స్పెక్టర్ వెంకట్, ఎస్సైలు ఆవుల తిరుపతి, స్వాతి, క్రాంతిలతో పాటు స్థానిక పోలీస్ సిబ్బంది, గ్రామ పెద్దలు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## తెలంగాణ భూదోపిడీ గుట్టు విప్పిన తీన్మార్ మల్లన్న

- నిజాం ఫర్మానా నుండి నేటి 'రైతు భరోసా' వరకు రెడ్లు, వెలమల కుట్రలు!
- ఈ లెక్కల పై నేను చర్చకు సిద్ధం ఎవడొస్తాడో రండి

**జమ్మికుంట. జులై 09 పీపుల్స్ డైరీ :** తెలంగాణ రాజ్యాధికార పార్టీ (TRP) రాష్ట్ర అధ్యక్షుడు తీన్మార్ మల్లన్న తెలంగాణ రాష్ట్రంలో జరిగిన చారిత్రక భూదోపిడీ, రాజకీయ ఆధిపత్యం, మరియు ప్రభుత్వ పథకాల ముసుగులో జరుగుతున్న ఆర్థిక దోపిడీని సవివరంగా ప్రజల ముందు ఉంచారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే పేదలకు కనీసం రెండు ఎకరాల భూమి పంచుతామని వరంగల్ డిక్లరేషన్‌లో చేసిన వాగ్దానం ఎలా సాధ్యమవుతుందో, "నిజాం వదిలిపెట్టిన తెలంగాణ" ద్వారా ఈ భూమిని ఎలా వెలికితీస్తామో ఆయన స్పష్టం చేశారు. ఈ అంశంపై ఆయన వెల్లడించిన పూర్తి వివరాలు కింది విధంగా ఉన్నాయి:

### నిజాం వదిలిపెట్టిన తెలంగాణ - దాచిపెట్టిన ఫర్మానా నిజాలు

స్వతంత్రానికి ముందే, 1927లో నిజాం నవాబు వెట్టిచాకిరిని రద్దు చేస్తూ చట్టం చేశారు, కానీ అప్పటి గడీల దొరలు దానిని అమలు కానివ్వలేదు. 1945 నాటికి కౌలుదారులకు శాశ్వత సాగు హక్కులు కల్పిస్తూ నిజాం చట్టాలు చేశారని తెలిపారు. 1949 ఆగస్టు 15న నిజాం ఒక చారిత్రాత్మక ఫర్మానా జారీ చేశారు. దీని ద్వారా మక్తాలు, సంస్థానాలు, చిన్న చిన్న రాజ్యాలుగా ఉన్న జాగీర్ల వ్యవస్థను పూర్తిగా రద్దు చేసి, ఆ భూమి అంతా పేదలకే దక్కేలా ఆదేశాలు ఇచ్చారు. హైదరాబాద్ జాగీర్దార్ నిషేధ చట్టం కింద 995 మంది జాగీర్దారుల (దొరల) నుండి సుమారు లికోటి ఎకరాల భూమిని స్వాధీనం చేసుకుని, వారికి పరిహారంగా నిజాం ప్రభుత్వం 18 కోట్ల రూపాయలు చెల్లించిందిలి. అంటే ఆ నాటితోనే ఆ భూములపై రెడ్లకు, వెలమలకు హక్కులు పోయాయి. ఈ నిజాలన్నీ ఎనిమిదో తరగతి సాంఘిక శాస్త్రం పుస్తకంలో (పేజీ 101, 102) ఆధారాలతో సహా ఉన్నాయని తెలిపారు.

### కొండా వెంకట రంగారెడ్డి కుట్ర - కాసరా పహానీతో భూకబ్జా

నిజాం పాలన అంతమైన తర్వాత, బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వంలో ఇంగ్లీష్ రాకపోయినా కొండా వెంకట రంగారెడ్డి రెవెన్యూ శాఖ మంత్రి అయ్యారు. ఆయన రెవెన్యూ మంత్రిగా నిజాం ఇచ్చిన చారిత్రక ఫర్మానాను తుంగలో తొక్కి, దాచిపెట్టి, 1954-55 లో కాస్రా పహానీ అనే దొంగ పహానీని సృష్టించారు. దీని ద్వారా పరిహారం కింద 18 కోట్లు తీసుకున్న దొరలకు, జాగీర్దారులకు మళ్ళీ ఆ కోటి ఎకరాల భూములపై యాజమాన్య హక్కులు కట్టబెట్టారు. నాటి



నుండి నేటి వరకు సుమారు 70 ఏళ్లుగా రెవెన్యూ శాఖను రెడ్లు తమ గుప్పిట్లోనే ఉంచుకున్నారు మండిపడ్డారు.

పీవీ నరసింహారావు భూసంస్కరణలను అడ్డుకున్న వైనం 1970లో ముఖ్యమంత్రి అయిన పీవీ నరసింహారావు గారు, ఇందిరా గాంధీ అనుమతితో ఒక కుటుంబానికి 54 ఎకరాలకు మించి భూమి ఉండకూడదని 'ల్యాండ్ సీలింగ్ యాక్ట్' (భూ గరిష్ట పరిమితి చట్టం) డ్రాఫ్ట్ చేశారు. దీన్ని అడ్డుకోవడానికి లి400 మంది భూస్వాములు (రెడ్లు, వెలమలు) రాత్రికి రాత్రే తమ భార్యలకు విడాకులు ఇచ్చారులి. గర్భంలో ఉన్న పిండం పేరు మీద, చివరికి కుక్కలు, నక్కల పేరు మీద భూములను రిజిస్టర్ చేసి చట్టం నుండి తప్పించుకున్నారు. (ఈ విషయాలు 1972 అసెంబ్లీ రికార్డుల్లో, మద్దికాయల ఓంకార్ ప్రసంగాల్లో ఉన్నాయి). ఈ చట్టాన్ని అమలు చేయబోయిన పీవీ నరసింహారావుపై జై ఆంధ్ర ఉద్యమాన్ని బూచిగా చూపి, ఆయనను ముఖ్యమంత్రి పదవి నుంచి తొలగించేలా కుట్ర చేశారని ఆగ్రహించారు. స్పీకర్ పిడతల రంగారెడ్డి సభను బహిష్కరించినా, డిప్యూటీ స్పీకర్‌గా ఉన్న ముదిరాజ్ బిడ్డ సి. జగన్నాథరావు ప్రలోభాలకు లొంగకుండా ఈ బిల్లును పాస్ చేశారు. అయినా ఈ చట్టం ఎన్నడూ సరిగ్గా అమలు కాకుండా రెడ్లు వెలమలు కుట్ర చేశారని ధ్వజమెత్తారు.

### నేటి ప్రభుత్వ పథకాలు - పేదల అప్పులతో పెద్దలకు లబ్ధి (అక్షరాలా అంకెల్లో)

భూములు ఎవరి చేతిలో ఉంటే వారికే రైతుబంధు, రైతుభరోసా వంటి పథకాలు అందుతున్నాయి. తెలంగాణలో రెడ్ల జనాభా 4.5% లోపే ఉన్నా, వారి చేతిలో 13.5% భూములు ఉన్నాయి. కుటుంబాల వారీగా లబ్ధి: ఒక్కొక్క రెడ్డి కుటుంబానికి సగటున 5,94,483 లబ్ధి చేకూరితే, యాదవ కుటుంబానికి 3,50,000, ముదిరాజ్ కుటుంబానికి 2,45,000, గౌడ కుటుంబానికి 2,23,000, రజకులకు 1,68,000, నాయి బ్రాహ్మణులకు 1,03,000, పద్మశాలీలకు 1,12,000 మాత్రమే లబ్ధి చేకూరిందని ఆవేదన చెందారు. వ్యవసాయ బడ్జెట్ దోపిడీ: 2,57,400 కోట్ల వ్యవసాయ బడ్జెట్‌లో, కేవలం రెడ్లకే 34,749 కోట్లు, కమ్మలకు 5,148 కోట్లు, వెలమలకు 2,574 కోట్లు వెళ్లాయి. ఒక రెడ్డి రైతుకు సగటున ఏడాదికి 37,859 వివిధ పథకాల ద్వారా వస్తుంటే, బీసీ రైతుకు కేవలం 11,999 మాత్రమే వస్తున్నాయి.

### అప్పుల భారం బీసీలదే:

వ్యవసాయ పథకాల కోసం తెచ్చిన 2,75,000 కోట్ల అప్పుల్లో, అగ్రవర్ణాల (రెడ్లు, వెలమలు, కమ్మలు) నెత్తి మీద పడ్డ అప్పు 15,958 కోట్లు కాగా, వారు పొందిన లబ్ధి 42,471 కోట్లు (నికర లాభం 26,512 కోట్లు). అదే బీసీల నెత్తి మీద పడ్డ అప్పు 45,773 కోట్లు కాగా, వారికి తీవ్ర నష్టం చేకూరుతోంది.

### జనాభా బీసీలది - అధికారం ఓసీలది (నియోజకవర్గాల లెక్కలు)

తెలంగాణలోని 119 నియోజకవర్గాల్లో 59 చోట్ల రెడ్లు, వెలమలు, కమ్మలు ఎమ్మెల్యేలుగా ఉన్నారు. ఈ 59 నియోజకవర్గాల్లో వారి మొత్తం జనాభా కేవలం 8,80,000 అయితే, బీసీల జనాభా 90 లక్షలు. అయినా ఒక్క బీసీ కూడా ఇక్కడ ఎమ్మెల్యే కాలేదు. సగటున 1,679 వెలమ ఓట్లకు ఒక వెలమ ఎమ్మెల్యే, 18,626 రెడ్డి ఓట్లకు ఒక రెడ్డి ఎమ్మెల్యే తయారవుతుంటే, 1,46,951 బీసీ ఓట్లున్నా ఒక్క బీసీ ఎమ్మెల్యే లేడు గజ్వేల్ (KCR): కేవలం 480 వెలమ ఓట్లు ఉంటే, 1,74,769 బీసీ ఓట్లు ఉన్నాయి. సిరిసిల్ల :కేవలం 2,735 వెలమ ఓట్లు ఉంటే, 1,33,391 బీసీ ఓట్లు ఉన్నాయి. సిద్ధిపేట (హరీష్ రావు): కేవలం 410 వెలమ ఓట్లు ఉంటే, 1,49,343 బీసీ ఓట్లు ఉన్నాయి. కొడంగల్ (రేవంత్ రెడ్డి): 12,000 లోపు రెడ్డి ఓట్లు ఉంటే, 1,37,406 బీసీ ఓట్లు ఉన్నాయి. ఉప్పల్, మేడ్చల్ నియోజకవర్గాల్లోనూ లక్షల్లో బీసీ ఓటర్లు ఉన్నప్పటికీ అగ్రవర్ణాలే గెలుస్తున్నారని ఇది సామాజిక న్యాయం ఎలా అవుతుందని ప్రశ్నించారు.

### ఆపరేషన్ సర్జికల్ స్ట్రైక్ 59 - 2028లో బీసీల రాజ్యాధికారం

ఈ చారిత్రక అన్యాయాన్ని, భూదోపిడీని అంతం చేయడానికి తెలంగాణ రాజ్యాధికార పార్టీ "ఆపరేషన్ సర్జికల్ స్ట్రైక్ 59" కు శ్రీకారం చుట్టింది. అగ్రవర్ణాల గుప్పిట్లో ఉన్న ఈ 59 స్థానాలను బద్దలు కొట్టి, 2028లో బీసీ ప్రభుత్వాన్ని స్థాపిస్తాం. బీసీ ముఖ్యమంత్రి పీఠం ఎక్కిన వెంటనే, దాచిపెట్టిన నిజాం ఫర్మానాను బయటికి తీసి అక్రమంగా దొరల చేతుల్లో ఉన్న కోటి ఎకరాల భూమిని లాక్కుని ఎస్సీ, ఎస్టీ, బీసీ, పేద ప్రజల పాదాల చెంత పెడతామని తీన్మార్ మల్లన్న ప్రకటించారు. నేను బయటపెట్టిన ఈ లెక్కలలో ఒక్క పైసా తేడా ఉన్నా లేదా ఏ ఒక్క అంకె తప్పయినా, ఏ రెడ్డి, వెలమ, కమ్మ నాయకుడైనా సరే నాతో చర్చకు రావాలని, తాను దేనికైనా సిద్ధంగా ఉన్నానని తీన్మార్ మల్లన్న బహిరంగ సవాల్ విసిరారు. ఈ నిజాలను ప్రతి బీసీ బిడ్డకు చేరవేయాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు.

# ముగిసిన భద్రాద్రి జోనల్ జోనల్ పోలీస్ డ్యూటీ మీట్




**మట్టెవాడ, జూలై 09 (పీపుల్స్ డైరీ):** గత మూడు రోజుల నుండి వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో మామూనూరు పోలీస్ శిక్షణ కేంద్రంలో నిర్వహిస్తున్న భద్రాద్రి జోనల్ పోలీస్ డ్యూటీ మీట్ గురువారం ఘనంగా ముగిశాయి. మూడు రోజుల పాటు నిర్వహించిన ఈ డ్యూటీ మీట్‌లో జోనల్ పరిధిలో వరంగల్, ఖమ్మం పోలీస్ కమిషన రేట్లతో పా టు, మహబుబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన పోలీస్ అధికారులు కంప్యూటర్ పరిజ్ఞానం, ఫోరెన్సిక్ సైన్స్, ఫింగర్ ప్రింట్స్ లిఫ్టింగ్ అండ్ ప్యాకింగ్, బాంబ్ డిస్పోజల్, డాగ్ స్క్వాడ్, ప్రొఫెషన్ ఫోటో, వీడియోగ్రాఫీల విభాగాల్లో పోటీపడ్డారు. ఇందులో ప్రతిభ కనబరిచన పోలీస్ అధికారులకు వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత అధికారుల చేతుల మీదుగా పతాకాలను అంద చేశారు. ఇందులో వరంగల్ పోలీస్ కమిషనరేట్ విభాగా నికి 13 గోల్డ్ మెడల్స్ సహా మొత్తం 28 పతకాలను సాధించారు. అలాగే భద్రాద్రి కొత్తగూడెం 12, మహబూ బాబాద్ జిల్లాకు 13 , ఖమ్మం 9 పతకాలను సాధించారు. ఇందులో రాణించిన పోలీస్ అధికారులు త్వరలో మల్కాజి గిరి కమిషనరేట్‌లో జరగబోయే రాష్ట్రస్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌లో పాల్గొంటారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత మాట్లాడుతూ ఇలాంటి డ్యూటీ మీట్‌ల ద్వారా వృత్తి నైపుణ్యాన్ని సాధించవచ్చని, కఠోర సాధన చేస్తే కేవలం వృత్తి నైపుణ్యంతో పాటు అన్ని రంగాల్లో ప్రతిభ కబరచవచ్చని ముఖ్యంగా వృత్తి నైపుణ్యం సాధిం చడం ద్వారా విధి నిర్వహణలో ఎదురయ్యే పని ఒత్తిళ్ళను అదిగమించవచ్చన్నారు. జోనల్ స్థాయిలో కబరిచిన ప్రతిభనే రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయి పోటీల్లో కూడా కనబరచాలని పోలీస్ కమిషనర్ అధికారులకు సూచిం చారు. విజయవం తంగా ఈ పోటీలను ముగించడంలో కృషి చేసిన పోలీస్ అధికారులు, సిబ్బందిని పోలీస్ కమిషనర్ శ్వేత అభినందిం చారు. ఈ కార్యక్రమంలో అదనపు డిసిపిలు శ్రీనివాస్, బాలస్వామి, ఏసిపిలు, సురేంద్ర , డి.ఎస్పీలు శ్రీనివాస్, సాంబరాజు, ఆర్.ఐలు సతీష్, ఇన్స్పెక్టర్లు, క్రాంతికుమార్, ఎ, విశ్వేశ్వర్, ఎస్.ఐ విజయ్ కుమార్, ఆర్.ఎస్.ఐ శ్రవణ్ కుమార్ ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## బీజేపీ రాష్ట్ర ధార్మిక సెల్ సలహాదారుగా యోగా గురువు శ్రీనివాస్

**మట్టెవాడ , జూలై 09 (పీపుల్స్ డైరీ):** గత 25 సంవత్సరాలుగా యోగాలో విశేష సేవలు అందిస్తూ సుమారు మూడు లక్షల మందికి యోగా నేర్పించిన ఇల్లంద గ్రామానికి చెందిన ప్రముఖ యోగ గురువు పోశాల శ్రీనివాస్ ని భారతీయ జనతా పార్టీ ధార్మిక సెల్ తెలంగాణ రాష్ట్ర సలహాదారుగా నియమించారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు అధ్యక్ష తన హైదరాబాద్ నాంపల్లి బీజేపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రామచంద్ర రావు చేతుల మీదుగా పోశాల శ్రీనివాస్ నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా యోగా గురువు శ్రీనివాస్ మాట్లాడుతూ గడిచిన 25 సంవత్సరాలుగా యోగాలో విశేష సేవ లు అందించినందుకు గాను గుర్తించి తెలంగాణ రాష్ట్ర బిజెపి ధార్మిక సెల్ రాష్ట్ర సలహాదా రుగా నియమించటం చాలా ఆనందంగా ఉందన్నారు. యోగా శిక్షణ శిబిరాలే కాకుండా సమాజంలో అనేక సామాజిక, సేవా రంగాల్లో కూడా కార్యక్రమాలు నిర్వహించడం జరిగిం దన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎండోమెంట్ సెల్ కన్వీనర్ అన్నావజ్జుల సూర్యప్రకాష్ , కో కన్వీనర్ నిరంజన్ దేశాయ్, బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధులు ఎన్.వి.సుభాష్, కె.ప్రసాద్, ఎస్.అమర్నాథ్ , మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు పాల్గొన్నారు.

### విద్యారంగ సమస్యల పరిష్కారంలో

## ప్రభుత్వ వైఫల్యం

**- ఏఐఎస్‌బి రాష్ట్ర కన్వీనర్ హకీమ్ నవీద్**



**మట్టెవాడ, జూలై 09 (పీపుల్స్ డైరీ):** వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ శుక్రవారం రాష్ట్ర వ్యాప్త విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఏఐఎస్‌బి రాష్ట్ర కన్వీనర్ హకీమ్ నవీద్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో పూర్తిస్థాయిలో వైఫల్యం చెందిందని విద్యా సంవత్సరం ప్రారంభమైనా ఇప్పటివరకు విద్యాసంస్థలలో పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు అందక ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు డ్రెస్సులు సకాలంలో అందక ప్రభుత్వ విద్యాసంస్థలలో మౌలిక వసతులు లేక విద్యార్థులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆరోపించారు. కావున రాష్ట్ర ప్రభుత్వ అసమర్థ విధానాలకు వ్యతిరేకంగా విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఈ క్రింది డిమాండ్ల పరిష్కారం కోరుతూ జూలై 10వ తేదీన బందుకు పిలుపునివ్వడం జరిగిందన్నారు. ఈ బంద్‌లో ప్రైవేట్ విద్యాసంస్థలు ప్రభుత్వ పాఠశాల కళాశాల విద్యార్థులు స్వచ్ఛందంగా పాలు పంచుకొని విజయవంతం చేయాల్సిందిగా హకీమ్ విజ్ఞప్తి చేశారు.

## రాష్ట్ర గవర్నర్‌కు స్వాగతం కలిసిన కమిషనర్



**మట్టెవాడ, జూలై 09 (పీపుల్స్ డైరీ) :** తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల గురువారం నగర పర్యటనను పురస్కరించుకొని నగర శివారు మడికొండ ప్రాంతంలోని గ్రాండ్ ఎంట్రెన్స్ తో పాటు హన్మకొండ ఐడిఓసి (కలెక్టరేట్) ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో సందర్శించి ఏర్పాట్లను పరిశీలించిన బల్దియా కమిషనర్ టి.వెంకన్న పరిశీలించారు. ఈ సందర్భంగా గవర్నర్ కు మడికొండ వద్ద కమిషనర్ పూల మొక్క అందచేసి స్వాగతం పలికారు. ఈ పరిశీలనలో కమిషనర్ వెంట ఎస్ఈ రాజ్ కుమార్, సిఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, డిప్యూటీ కమిషనర్ బిర్రు శ్రీనివాస్, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, హెచ్ఓ లక్ష్మారెడ్డి తదితరులు ఉన్నారు.

## ఎంపీ వద్దిరాజును సత్కరించిన కేసీఆర్

**ఖమ్మం, జూలై 9 (పీపుల్స్ డైరీ) :** బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేతగా నియమితులైన రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర పార్టీ అధ్యక్షులు కల్వకుంట్ల చంద్రశేఖర రావును కలిసి ఆశీస్సులు అందుకున్నారు. రాజ్యసభలో పార్టీ నేతగా, పార్లమెంటరీ పార్టీ లీడర్‌గా రవిచంద్రను నియమిస్తూ గురువారం సాయంత్రం కేసీఆర్ ఆయనకు పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కేసీఆర్ కు రవిచంద్ర పుష్పగుచ్ఛమిచ్చి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు, ధన్యవాదాలు చెప్పారు. రవిచంద్రకు కేసీఆర్ తన ఆశీస్సులు అందజేస్తూ శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.





## నాగన్న విప్లవోద్యమ సాంస్కృతిక ధ్రువతార

**ప్రముఖ కవి, గాయకులు యోచన**

**మట్టెవాడ, జూలై 9(పీపుల్స్ డైరీ) :** విప్లవ సాంస్కృతికోద్యమ సేనాని, పీడిత తాడిత ప్రజల ధ్రువతార కామ్రేడ్ నాగన్న మరణం తీరని లోటని ప్రముఖ కవి, గాయకులు యోచన అన్నారు. గురువారం సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో ఖిలావరంగల్లోని చమన్‌లో అరుణోదయ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు కామ్రేడ్ నాగన్న సంతాప సభ సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా జిల్లా కార్యదర్శి రాజేందర్ అధ్యక్షతన జరిగిన సభలో ప్రముఖ కవి గాయకులు యోచన పాల్గొని మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో జరుగుతున్న అసమానతలు దోపిడీ పీడనలు ప్రజలను పట్టిపీడిస్తున్న సందర్భంలో సాంస్కృతిక ఉద్యమాలను నిర్వహించాల్సిన సందర్భంలో కామ్రేడ్ నాగన్న మరణం తీరని లోటని అన్నారు. నాగన్న విప్లవ రాజకీయ జీవితం విప్లవ సాంస్కృతిక జీవితం 1977లో ఇందిర ప్రభుత్వం ఎమర్జెన్సీ ఎత్తివేసిన తర్వాత ఒకేసారి మొదలైనవని, 50 సంవత్సరాల అరుణోదయ సుదీర్ఘ చరిత్రతో నాగన్న జీవితం ముడిపడి ఉందని కానీ తన రంగప్రవేశానికి ముందు అనేక అసమానతలని చూడటం జరిగిందని వాటి మూలంగానే విప్లవోద్యమ నాయకులు కామ్రేడ్ మద్ది వెంకటరెడ్డి, కామ్రేడ్ శ్రీపద శ్రీహరిల స్ఫూర్తితో ఉద్యమాలలో అడుగిడడం జరిగిందని ఆనాటి నుండి నేటివరకు జీవితాంతం అరుణోదయ సాంస్కృతిక సమాఖ్యని రాష్ట్రంలో విస్తరింప చేయడానికి ప్రజా సమస్యలపై గొంతెత్తి అనేక రకాల పాటలను పాడుతూ ప్రజలను చైతన్యవంతం చేయడం జరిగిందని ఖమ్మం జిల్లా అరుణోదయ సంస్థలు తొలితరంలో కీలకపాత్ర పోషించిన ఇద్దరిలో కామ్రేడ్ నాగన్న ఒకరిని అన్నారు. ఐఎఫ్.టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ నాగన్న జీవితం అనేక ఒడిదుడుకులతో సాగిందని అయినా ఎక్కడ కూడా నిరాశ నిస్పృహలకు గురికాకుండా అమరుల త్యాగాలని నెమరు వేసుకుంటూ ముందుకు సాగటం జరిగిందన్నారు. ఈ సభలో ప్రముఖ అడ్వకేట్ తీగల జీవన్, ఐఎఫ్.టియు జిల్లా నాయకులు అప్పారావు, సిపిఐ ఎంఎల్ మాస్టన్ జిల్లా నాయకులు నర్సింగరావు, సిపిఐ ఎంఎల్ నాయకులు ఐలయ్య, ప్రముఖ సీనియర్ జర్నలిస్ట్ సంగోజు రవి, రాష్ట్ర పూర్వ నాయకులు సంజీవ, న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు బండి కోటేశ్వరరావు, రాచర్ల బాలరాజు గట్టి కృష్ణ జక్కుల తిరుపతి, అరుణోదయ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఇట్టబోయిన రవి, గుర్రం అజయ్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రజా సంఘాల నాయకులు బండి కుమార్, కానుగుల రంజిత్, హరిబాబు, బండి వెంకటేశ్వర్లు, వీరన్న, భీమగాని మల్లయ్య, ఎర్ర ఐలయ్య, జయ బాబు, వసంత, అక్క ప్రభాకర్, చేరాలు తదితరులు పాల్గొన్నారు.

## వర్షాధారిత మండలాల్లో చెరువులను గోదావరి జలాలతో నింపాలి

**తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు ఉపాధ్యక్షులు దుగ్గి కృష్ణ**



**ఏన్కూరు, జూలై 9 (పీపుల్స్ డైరీ) :** జిల్లాలో ఉన్న చెరువులను గోదావరి జలాలతో నింపాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు ఉపాధ్యక్షులు దుగ్గి కృష్ణ డిమాండ్ చేశారు. గురువారం ఏన్కూరు ప్రజా సంఘాల కార్యాలయం లో రైతు సమావేశంలో రాంబాబు, కృష్ణ మాట్లాడుతూ ఏన్కూరు కామేపల్లి కారేపల్లి మండలాలకు తక్షణమే గోదావరి జలాల అందించే సీతారామ ప్రాజెక్టు పూర్తి చేయుటకు అవసరమైన నిధులు విడుదల పైన చింతకాని రైతు భరోసా సభలో ముఖ్యమంత్రి స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టు పూర్తి చేయుటకు అవసరమైన తొమ్మిది వేల కోట్ల రూపాయలు గ్రీన్ ఛానల్ ద్వారా విడుదల చేయుటకు రాష్ట్ర మంత్రి వర్గం నిర్ణయం చేయాలని కోరారు. ఖమ్మం జిల్లాలో అత్యంత వర్షా ఆధారిత కామేపల్లి కారేపల్లి, ఏన్కూరు, రంగనాథ పాలెం, ఖమ్మం రూరల్ మండలాలు సాగు భూమికి నీరు అందించే సీతారామ ప్రాజెక్టు పూర్తి చేయుటకు జిల్లాలో ఉన్న ముగ్గురు మంత్రులు బాధ్యత తీసుకోవాలని కోరారు. కామేపల్లి మండ లంలో సీతారామ ప్రాజెక్టు భూ నిర్వాసితులకు పరిహారం అవార్డు 2019 లో ప్రకటించి నేటికి రైతులకు పరిహారం అందించలేదు అన్నారు. పరిహారం ఇవ్వకపోగా రైతులకు రైతు భరోసా నిధులు కూడా ఇవ్వడం లేదు అని ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం పరిహారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకులు దొంతి బోయిన నాగేశ్వరరావు. భూ నిర్వాసితుల సంఘం నాయకులు ఎస్ కె షరీఫ్, వెంకన్న, అంజయ్య పాల్గొన్నారు.

## ఉద్యమకారుల గుర్తింపు కమిటీ కాలయాపన చేయొద్దు



**ఆత్మకూరు, జూలై 9 (పీపుల్స్ డైరీ) :** తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ కాలయాపన కమిటీగా మారకుండా పారదర్శకంగా పనిచేసి అర్హులైన ఉద్యమకారులను త్వరగా గుర్తించాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి ఇర్సడ్ల సదానందం డిమాండ్ చేశారు. గురువారం ఆత్మకూరు మండల కేంద్రంలో నిర్వహించిన ఫోరం గ్రామ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల యూనివర్సిటీలో జరిగిన గుర్తింపు కమిటీ సమావేశంలో కే.కేశవరావు (కేకే) చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, ప్రభుత్వం గుర్తింపు కోసం స్పష్టమైన విధి విధానాలను ప్రకటించాలని కోరారు. ఉద్యమకారుల గుర్తిం పు ప్రక్రియను జాప్యం చేస్తే ఉద్యమకారులతో కలిసి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో గ్రామ అధ్యక్షుడు భాషబోయిన సాగర్, ఇమానుయేల్, కాలం సాంబరెడ్డి, కరివేద సాంబరెడ్డి, సమ్మిరెడ్డి, కుక్కల జంపయ్య, వడ్డేపల్లి కోటయ్య, మోత్కూరి రాజేందర్, తనుగుల వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

## గొత్తికోయ గుంపులో పండ్లు, కేకుల పంపిణీ



**గోవిందరావుపేట, జూలై 9 (పీపుల్స్ డైరీ) :** పంచాయతీ రాజ్ శాఖ మంత్రిధనసరి అనసూయ సీతక్కపుట్టిన రోజు సందర్భంగా గురువారం లవ్ అలా గొత్తి కోయ గుంపు వద్ద సీతక్క జన్మదినాన్ని పురస్కరించుకొని గోవిందరావుపేట మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బైరీ అభిలాష్ అధ్యక్షతన లవ్వల జనగలంచలోని గోతికోయ గూడాలలో కేక్ కోసి చేసి మిఠాయిలు బిస్కెట్ ప్యాకెట్లు అరటి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గోవిందరావుపేట మండలంలోని యూత్ నాయకులు పసర గ్రామ కమిటీ యూత్ నాయకులు పాల్గొన్నారు.

## బీజేపీ గ్రామ పార్టీ అధ్యక్షునిగా చీర రామకృష్ణ



**కేసముద్రం, జూలై 9 (పీపుల్స్ డైరీ) :** అర్పణపల్లి గ్రామంలో జరిగిన బీజేపీ పార్టీ సమావేశంలో చీర రామకృష్ణ గ్రామ పార్టీ అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు రామకృష్ణ పేరును ప్రతిపాదించగా అందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. నూతన అధ్యక్షుడికి పార్టీ శాలువా కప్పి, పూలమాల వేసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, ప్రజా సమస్యలపై పోరాడతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు,గంధసిరి యాకంభ్రం పిట్టల మురళి సమ్మయ్య కొప్పు యాకంభ్రం ఎల్లయ్య వేంకటాద్రి అశోక్ సతీష్ హిమామ్ యాకుబ్ సవాలి కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పాలిటెక్నిక్ కళాశాలలో ఎబివిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**కేసముద్రం, జూలై 9 (పీపుల్స్ డైరీ) :** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ 78 వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు కేసముద్రం శాఖ అద్వర్యంలో కేసముద్రం స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో చిత్తరీ చాణక్య అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు .ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ మెంబర్ ముంజంపల్లి దేవేందర్ పాల్గొని ఏబీవీపీ పతాకావిష్కరణ చేశారు. అంతరం విద్యార్థిని విద్యార్థులను ఉద్దేశించి ముంజంపల్లి దేవేందర్ మాట్లాడుతూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) దేశవ్యాప్తంగా విద్యార్థుల ద్వారా దేశం, సమాజం కోసం ఏర్పడి 78వ వసంతంలోకి అడుగుపెట్టిందని అన్నారు . ఏబీవీపీ స్థాపించినప్పటి నుంచి నేటి వరకు కూడా" విద్యారంగం ఒక కుటుంబం అనే భావనతో" పనిచేస్తూ విద్యార్థుల మధ్య ఉంటూ కళాశాలలు కేంద్రంగా చేసుకొని ఏబీవీపీ కార్యక్రమాలు నిర్వహిస్తూ , విద్యార్థులు సమస్యల పై పోరాడుతున్న ఏకైక విద్యార్థి సంఘం ఏబీవీపీ అన్నారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితులలో మన దేశాన్ని విచ్ఛిన్నం చేయడానికి అనేక శక్తులు ప్రయత్నం చేస్తూనే ఉన్నాయి అని వాటి తిప్పి కొట్టాలన్నారు . వివిధ




రకాల సంఘాలను స్థాపించి విద్యార్థులలో యువకులలో దేశ విద్రోహ కార్యక్రమాలు నింపి కుల రాజకీయాల పేరుతో ముందుకు వస్తున్న శక్తులను తిప్పి కొట్టడానికి యువత సన్నద్ధం కావాలి. దేశంలో విదేశీ భావాజాలంతో కూడిన రోజుకు దేశంలో జరుగుతున్న తీరును విదేశీ సంస్కృతిని నేటి యువత విడనాడాలి నేటి విద్యార్థులు సమాజాన్ని చదివి దేశ విదేశాలకు నూతన ఆవిష్కరణలు అందించే శక్తి సామర్థ్యాలు ఉన్న విద్యార్థులకు ప్రత్యేక దినంగా ఏబీవీపీ జూలై 9న దేశవ్యాప్తంగా జాతీయ విద్యార్థి దినోత్సవం గా నిర్వహిస్తుంది.




78సంవత్సరాలలో సమాజంలోని భిన్న వ్యవస్థలలో ఎబివిపి కార్యకర్తలు సమాజంలో మంచి మార్పుల కోసం, పాజిటివ్ దృక్పథంతో కృషిచేస్తుందన్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే 'నిరంతరం మంచి పౌరులను తయారుచేసి దేశానికి అందించే మ్యాన్ మేకింగ్ మిషన్' కర్మాగారమే అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ అని అన్నారు .ఈ కార్యక్రమంలో చాణిక్య ,ముకేశ్ గణేష్, సురేందర్, నవీన్ కార్యకర్తలు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## ఉప సర్పంచ్‌ల ఫోరం ఉపాధ్యక్షులుగా గడ్డం రాజు

**శాయంపేట, జూలై 9 (పీపుల్స్ డైరీ) :** ఉప సర్పంచ్‌ల ఫోరం జిల్లా ఉపాధ్యక్షులుగా గడ్డం రాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉప సర్పంచ్‌ల రాష్ట్ర అధ్యక్షులు బొట్ల కార్తీక్ ఆధ్వర్యంలో ఎన్నుకోవడం జరిగింది. గడ్డం రాజు మండలంలోని రాజు పల్లి గ్రామ ఉప సర్పంచ్ గా కొనసాగుతున్నారు. జిల్లా ఉపాధ్యక్షులుగా ఎన్నిక కాబడిన రాజును రాజు పల్లి గ్రామ సర్పంచ్ మలసాని లక్ష్మణరావు, నాయకులు గజ్జెల రాజు, సిద్దూరి మధుకర్ రావు మలసాని తిరుపతిరావు గడ్డం రమేష్ వార్డు మెంబర్లు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ ఎన్నికకు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. ఉప సర్పంచ్ ల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని స్పష్టం చేశారు.

## ఉద్యోగ నోటిఫికేషన్స్ ఇచ్చి నిరుద్యోగులను ఆదుకోవాలి



**ఎలుకటి రాజయ్య మాదిగ**

**చిట్యాల, జూలై 9 (పీపుల్స్ డైరీ) :** రాష్ట్రంలో కొత్త ఉద్యోగాల నోటిఫికేషన్ కోసం నిరుద్యోగులు ఏండ్ల తరబడి ఎదురుచూస్తున్నారని ప్రభుత్వం వెంటనే అన్ని ప్రభుత్వ శాఖల్లో ని ఖాళీలను గుర్తించి ఉద్యోగ నోటిఫికేషన్‌లతో పాటు ఎస్సీ ఎస్టీ బ్యాక్ లాగ్ ఉద్యోగాలకు కూడా నోటిఫికేషన్స్ విడుదల చేసి నిరుద్యోగులను ఆదుకోవాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు ఎలుకటి రాజయ్య మాదిగ అన్నారు. ఈ సందర్భంగా ఆయన గురువారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో మాట్లాడుతూ నిరుద్యోగ అభ్యర్థులు ఉద్యోగాల కోసం కోచింగ్ సెంటర్లకు లక్షలాది రూపాయలు వెచ్చిస్తున్నా రని ఉద్యోగ నోటిఫికేషన్లు ఉపాధి లేక వారు కనీస అవసరాలు కూడా తీర్చుకోలేని పరిస్థితిలో ఉన్నారని ప్రభుత్వం నిరుద్యోగ అభ్యర్థులకు నిరుద్యోగ భృతి చెల్లించాలన్నారు. దాంతో వారు ఎవరి పై ఆధారపడకుండా కనీసం కనీస అవసరాలు తీర్చుకుంటారని తెలిపారు. ఉద్యోగ నోటిఫికేషన్లు ఆలస్యం కావడంతో కొంతమంది అభ్యర్థుల వయస్సు కూడా ఉద్యోగ అర్హతకు మించి పోవడంతో వారికి అన్యాయం జరుగుతుందన్నారు. ప్రభుత్వం స్పందించి జాప్యం చేయకుండా సాధారణ ఎస్సీ ఎస్టీ బ్యాక్ లాగ్ ఉద్యోగ నోటిఫికేషన్లు వెంటనే విడుదల చేయాలన్నారు.

## చిన్నారిని ఆశీర్వదించిన నాయకులు



**చిట్యాల, జూలై 9 (పీపుల్స్ డైరీ) :** మండలం లోని గోపాల్పూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా సేవాదళ్ అధ్యక్షులు ఏకు రవీందర్ కుమార్తె నూతన వస్త్ర ఫల పుష్పాలంకరణ కార్యక్రమానికి భూపాలపల్లి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు భట్టు కరుణాకర్ తెలంగాణ రాష్ట్ర టీపీసీసీ అధికార ప్రతినిధి గాజర్ల అశోక్ భూపాలపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ బుర్ర కొమురయ్య చిట్యాల మండల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గూట్ల తిరుపతి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి దొడ్డికిష్టయ్య గురువారం హాజరై చిన్నారుని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వారి వెంట జిల్లా ఉపాధ్యక్షులు వరం సమ్మయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకీ యాదవ్ టేకుమట్ల మాజీ జడ్పిటిసి సభ్యులు పులి తిరుపతిరెడ్డి కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మూలశంకర్ గౌడ్ ప్రధాన కార్యదర్శి గడ్డం కొమరయ్య ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు బొట్ల రవి మాజీ సర్పంచ్ గజ్జి రవి సీనియర్ నాయకులు బుర్ర లక్ష్మణ్ గౌడ్ గుర్రం నర్సయ్య నల్ల రాజిరెడ్డి ఏకు స్వామి తదితరులు పాల్గొన్నారు.

## విగ్రహ ప్రతిష్టాపనలో శాసనమండలి వైస్ చైర్మన్



**గణపురం, జూలై 9 (పీపుల్స్ డైరీ) :** గణపురం మండలంలోని గాంధీనగర్ గ్రామంలో ముదిరాజ్ కులస్తుల ఆరాధ్య దైవం శ్రీ పెద్దమ్మ తల్లి, శ్రీ పోతురాజు విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమానికి గురువారం శాసనమండలి వైస్ చైర్మన్ బండ ప్రకాష్ ముఖ్య అతిథిగా హాజరై పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ... గ్రామ దేవతల పూజలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని అన్నారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు గ్రామాల్లో ఐక్యతను, సోదరభావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. గ్రామాభివృద్ధితో పాటు ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంప్రదాయాల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ కుల సంఘం అధ్యక్షుడు బొల్ల బాలకృష్ణ, ముదిరాజ్ కుల సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# 'గ్రామీణాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం' : ఎమ్మెల్యే గండ్ర



**గణపురం, జూలై 9 (పీపుల్స్ డైరీ) :** గణపురం మండలం లోని లక్ష్మారెడ్డిపల్లి గ్రామ శివారులోని మోరంచ వాగు వద్ద పొలాలకు వెళ్లే ప్రధాన దారికి ఎట్టకేలకు శాశ్వత పరిష్కారం లభించింది. దాదాపు వందేళ్లుగా దయనీయ స్థితిలో ఉన్న ఈ మార్గం కారణంగా రైతులు, గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నప్పటికీ, గతంలో ఏ ప్రజాప్రతినిధి కూడా సమస్య పరిష్కారంపై దృష్టి సారించ లేదు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు చొరవతో రూ.25 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరై, పనులు పూర్తయ్యాయి. కాగా గురువా రం ఎమ్మెల్యే ఈ సీసీ రోడ్డును ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ వ్యవసాయ భూములకు చేరుకునేలా అవసరమైన రహదారులు, ఇతర వసతులను దశలవారీగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. గ్రామాభి వృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని పేర్కొన్నారు. రోడ్డు నిర్మాణం పూర్తవడంతో లక్ష్మారెడ్డిపల్లి రైతులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తహశీల్దార్ రాజేశ్వర రావు, ఎంపీడీవో భాస్కర్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ పెద్దలు, రైతులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## పెద్దమ్మ తల్లి సన్నిధిలో ఎమ్మెల్యే గండ్ర ప్రత్యేక పూజలు



**గణపురం, జూలై 9 (పీపుల్స్ డైరీ) :** గణపురం మండలంలోని గాంధీనగర్ గ్రామంలో నిర్వహించిన శ్రీ పెద్దమ్మ తల్లి, శ్రీ పోతురాజు విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో గురువారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడు తూ.. గ్రామ దేవతల ఆరాధన మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్నారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు గ్రామాల్లో ఐక్యత, సోదరభావాన్ని మరింత బలోపేతం చేస్తాయని అన్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. గ్రామాభివృద్ధితో పాటు ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంప్రదాయాల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కేటీపీపీలో కొనసాగుతున్న నిరసన




**గణపురం, జూలై 09 (పీపుల్స్ డైరీ) :** వైటీపీఎస్‌లో బొగ్గు, బూడిద విభాగాల నిర్వహణను 255 కోట్ల వ్యయంతో మూడు సంవత్సరాల పాటు ప్రైవేటీకరణకు అప్పగించే టెండర్ ప్రక్రియను చేపట్టడాన్ని వ్యతిరేకిస్తూ కేటీపీపీలో టీజీపిఈ జెఏసి పిలుపు మేరకు గురువారం 16వ రోజు భోజన విరామ సమయంలో విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి ప్రధాన గేటు ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యుత్ సంస్థల్లో కీలకమైన ఆపరేషన్ విభాగాలను ప్రైవేటీకరించడం వల్ల ఉద్యోగ భద్రత దెబ్బతినడమే కాకుండా, పనిభారం అసమానంగా పెరగడం, అనుభవజ్ఞులైన సిబ్బందిని పక్కన పెట్టడం, భద్రతా ప్రమాణాలు దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సిహెచ్ పి,ఏహెచ్ పి ప్రైవేటీకరణ టెండర్ ప్రక్రియను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.ప్రజా రంగ సంస్థలను బలోపేతం చేయాల్సిన సమయంలో ప్రైవేటీకరణ చర్యలు సంస్థ భవిష్యత్తుకు,కార్మికుల హక్కులకు విరుద్ధమని ఆవేదన వ్యక్తం చేశారు.ఇది కేవలం ఒక ప్లాంట్‌కు సంబంధించిన సమస్య మాత్రమే కాదని,రాబోయే రోజుల్లో విద్యుత్ రంగంలో మరిన్ని విభాగాలను అవుట్‌సోర్సింగ్ లేదా ప్రైవేటీకరణ పేరుతో బలహీనపరిచే ప్రయత్నాలకు ఇది నాంది కావచ్చని హెచ్చరించారు.ఆందోళన వ్యక్తం చేశారు. యాజమాన్యం తమ డిమాండ్ లను పట్టించుకోకపోతే రాబోయే రోజుల్లో మరింత ఉధృతమైన ఆందోళనలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని యూనియన్ల ఇంజనీర్స్ అసోసియేషన్ ల ప్రతినిధులు, ఉద్యోగులు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## మండల కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులుగా చిట్టిమల్ల ప్రసాద్



**పినపాక, జూలై 9(పీపుల్స్ డైరీ) :** పినపాక మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులుగా చిట్టి మల్ల ప్రసాద్ ను రాష్ట్ర చైర్మన్ కవ్వంపల్లి సత్యనారాయణ, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు గద్దల రమేష్ నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పినపాక మండలంలో చురుకుగా పనిచేస్తున్నందుకు నియమించినట్లు తెలిపారు. పినపాక మండలంలోని పలువురు నాయకులు చిట్టిమల్ల ప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సీ సెల్ అధ్యక్షులు ప్రసాద్ మాట్లాడుతూ ఈఅవకాశాన్ని కల్పించిన పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు, రాష్ట్ర, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులకు ప్రత్యే కంగా ధన్యవాదాలు తెలిపారు. శక్తివంచన లేకుండా పని చేస్తానని ప్రసాద్ తెలిపారు.

## సాంకేతిక పొరపాటుపై దుష్ప్రచారం సరికాదు - గాజుల శివరాజు

**గోవిందరావుపేట, జూలై 9 (పీపుల్స్ డైరీ) :** ప్రభుత్వ కార్యాలయంలో సాంకేతిక కారణాల వల్ల జరిగిన తప్పిదాన్ని అధికారులు పునర్ పరిశీలించినప్పటికీ ఆ విషయంపై దుశ్ప్రచారం చేయడం సరికాదని గాజుల శివ ఒక ప్రకటనలో తెలిపారు. సమాజంలో బాధ్యతాయుతంగా ఉంటూ, ప్రజా సమస్యలపై గళం విప్పే నాయకుల ఎదుగుదలను ఓర్వలేక కొందరు స్థానిక కుల రాజకీయ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తూ యూట్యూబర్లు కలిసి చేస్తున్న కుట్రలకు తాజా ఉదాహరణే "గాజుల శివరాజుపై జరుగుతున్న దుష్ప్రచారం అని అన్నారు. నాపై తప్పుడు ప్రచారం చేసే మిత్రులు ఆత్మ విమర్శ చేసుకోవడం ఎందుకైనా మంచిది అని సూచించారు,

## జూలై 28 వరకు ఓపెన్ స్కూల్ అడ్మిషన్స్

**మొగుళ్లపల్లి, జూలై 9 (పీపుల్స్ డైరీ) :** మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో మొగుళ్ళపల్లి స్టడీ సర్కిల్ కోఆర్డినేటర్ పింగిలి విజయపాల్ రెడ్డి మాట్లాడుతూ. తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహి స్తున్న పదవ తరగతి ఇంటర్మీడియట్ 2026-27 విద్యా సంవత్సరంలో అడ్మిషన్స్ పొందేందుకు ఇదొక సువర్ణ అవకాశం. కావున నిర్ణీత ఫీజుతో ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఈనెల 28 వరకు ఉంటుందని, అలాగే ఉన్నత చదువులకు ఉద్యోగాల కు, రెగ్యులర్ వారిగానే సమాన అవకాశాలు ఉంటాయని ఇంటర్ కేవలం ఒకే సంవత్సరంలో పూర్తి చేసుకునే అవకా శం ఉంటుందని మొగుళ్లపల్లి మండల కేంద్రంలోని స్థానిక జడ్పీహెచ్ఎస్‌లో పింగిలి విజయపాల్ రెడ్డి తెలిపారు. మరిన్ని వివరాల కోసం చరవాణి 9866608361 ద్వారా సంప్రదించా ల్సిందిగా సూచించారు.

## సీసీ రోడ్డు పనులు ప్రారంభం



**శాయంపేట, జూలై 9 (పీపుల్స్ డైరీ) :** శాయంపేట మండల కేంద్రంలోని కాకతీయుల కాలం నాటి శతాబ్దాల చరిత్ర కలిగిన శ్రీ మత్స్యగిరి స్వామి ఆలయం నుండి సిసి రోడ్డు పనులు గురువారం ప్రారంభమయ్యాయి. స్థానిక సర్పంచ్ చింతల ఉమా రవిపాల్, శ్రీ మత్స్యగిరి స్వామి ఆలయ చైర్మన్ సామల బిక్షపతి హాజరై సిసి రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ బిక్షపతి మాట్లాడుతూ ఐదు లక్షలతో సిసి రోడ్డు పనులను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సహకారంతో చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు ఆరుట్ల కృష్ణమాచార్యులు, జిన్నా ప్రతాపరెడ్డి,జిన్నా కృపాకర్ రెడ్డి, బాసాని రవి వార్డు సభ్యులు కొత్తపల్లి రవీందర్, రాయరాకుల సుమన్, భద్రయ్య తదితరులు ఉన్నారు.

## నిరుద్యోగ భృతి 5 వేలు ఇవ్వాలి



**చిట్యాల, జూలై 9 (పీపుల్స్ డైరీ) :** ఆమ్ ఆద్మీ పార్టీ భూపాలపల్లి మండల అధ్యక్షుడు జాడి నితిన్ ఆధ్వర్యంలో జయశంకర్ భూపాల పల్లి జిల్లా కేంద్రంలో ఉన్న స్థానిక కలెక్టర్ కార్యాలయంలో గురువా రం వినతి పత్రం అందజేశారు. అనంతరం నితిన్ మాట్లాడుతూ నిరుద్యోగులకు ప్రతినెలా 5 వేల రూపాయల నిరుద్యోగ భృతి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఇలాంటి జిల్లాలో పరిశ్రమలు ఇంకా అవసరమని అన్నారు. జిల్లాలో పరిశ్రమలు ఏర్పడడం వల్ల జిల్లాలో వున్న నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు వస్తాయని దీనివల్ల జిల్లాలో నిరుద్యోగుల సంఖ్య తగ్గే అవకాశం ఉందని అన్నారు. అలాగే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చి మాట తప్పిందని అన్నారు. వెంటనే నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి 5 వేలు ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. నిరుద్యోగ భృతి ప్రకటించడం వలన నిరుద్యోగులకు ఆర్థిక భరోసా కలిగించడంతో పాటు మనోధైర్యాన్ని నింపిన వారు అవుతారని అలాగే ఉద్యోగాల అన్ని నోటిఫికేషన్స్ కూడా త్వరగా విడుదల చేయాలని ఈ అంశాల మీద జిల్లా కలెక్టర్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగిందన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్ )ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# వ్యక్తిగతంగానే జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు

**సొసైటీలతో సంబంధం లేకుండా ఇచ్చేలా కృషి - న్యాయపరమైన చిక్కులు లేకుండా ఉంటాయని స్పష్టత - టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కమిటీ వినతిపై స్పందన**



**ఖమ్మం, జూలై 9 (పీపుల్స్ డైరీ) :** సొసైటీలతో సంబంధం లేకుండా జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇచ్చే విషయమై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్- హెచ్-2843) ఖమ్మం జిల్లా కమిటీ గురువారం చింతకాని మండలం లచ్చగూడెంలో సమర్పించిన వినతిపత్రంపై డిప్యూటీ సీఎం స్పందించారు. మండలంలోని జగన్నాథపురంలో శుక్రవారం జరిగే రైతు ఆశీర్వాద సభకు ముఖ్యమంత్రి హాజరవుతున్న దృష్ట్యా జర్నలిస్టుల ఇండ్ల స్థలాల అంశాన్ని సీఎం దృష్టికి తీసుకు వెళ్లాల్సిందిగా టీడబ్ల్యూజేఎఫ్ నేతలు కోరారు. దీనిపై స్పందించిన భట్టి... సొసైటీల ద్వారా అయితే న్యాయపరమైన చిక్కులు ఉంటాయి కాబట్టి, అవేవీ లేకుండా వ్యక్తిగతంగానో... బీపీఎల్ కోటాలోనో... మరో రకంగానో ఇచ్చే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జర్నలిస్టుల్లో చాలామంది పేదలు, మధ్యతరగతి వర్గానికి చెందినవారు, చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్నారని, అద్దె ఇండ్లలో ఉంటూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వినతిపత్రంలో టీడబ్ల్యూజేఎఫ్ పేర్కొంది. జర్నలిస్టుల ఇండ్ల స్థలాల విషయమై అనేక పర్యాయాలు గత, ప్రస్తుత ప్రభుత్వంలో టీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో విజ్ఞప్తులు, పోరాటాలు నిర్వహించామని ఫెడరేషన్ నేతలు తెలిపారు. ఈ నేపథ్యంలో గత ప్రభుత్వం వెలుగుమట్ల, వీవీ పాలెం రెవెన్యూలో 23 ఎకరాలకు పైగా కేటాయిస్తూ జీవో ఇచ్చిందని, కానీ అది కార్యరూపం దాల్చలేదని సూచించారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో దీనిపై కొంత సందిగ్ధత ఏర్పడిందని న్యాయపరమైన చిక్కులు లేకుండా జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు పంపిణీ చేసే విషయమై ఇప్పటికే ముఖ్యమంత్రితో పాటు మంత్రులు ప్రకటనలు చేసి ఉన్నారని ప్రస్తావించారు. సొసైటీలతో సంబంధం లేకుండా జర్నలిస్టులకు వ్యక్తిగతంగా ఇండ్ల స్థలాలు ఇస్తామని సీఎం హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఈ విషయంలో నాన్చివేత ధోరణి విడనాడాలని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్ ఖదీర్, కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షులు దువ్వా సాగర్, టీబీజేఏ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆవుల శ్రీనివాస్, మానుకొండ రవికిరణ్, జిల్లా కమిటీ సభ్యులు రాంపుడి నాగేశ్వరరావు, కొత్త యాకేష్, మంకెన నాగేశ్వరరావు, ఖమ్మం నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు తురగ రాఘవేంద్రమూర్తి, గరిడేపల్లి వెంకటేశ్వర్లు, స్టేట్ కౌన్సిల్ మెంబర్ నలుబోల మధుశ్రీ, టీబీజేఏ కెమెరామన్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఫయాజ్, గణేష్, అర్షద్, శరత్, నాయకులు సీహెచ్ ప్రసాద్, సురేందర్, గడ్డం విజయ్ తదితరులున్నారు.

పీపుల్స్ డైరీ

వరంగల్

శుక్రవారం, 10 జూలై 2026

సంపుటి : 18, సంచిక : 124



# రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

తెలంగాణ చరిత్రలోనే అతిపెద్ద రైతు ఆశీర్వాద సభకు చింతకాని వేదిక

9 రోజుల్లో రూ.9 వేల కోట్ల రైతు భరోసా అందించిన ఏకైక రాష్ట్రం తెలంగాణ

తక్కువ నీటితో అధిక ఆదాయం వచ్చే పంటలపై రైతులు దృష్టి పెట్టాలి

150 స్టాల్స్ ఏర్పాటు అంచనాలకు మించి 11 వేల మంది రైతుల హాజరు

మెగా రైతు మేళాలో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల





**చింతకాని, జూలై 9 (పీపుల్స్ డైరీ) :** రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. చింతకాని మండలం జగన్నాథపురం గ్రామంలో గురువారం నిర్వహించిన మెగా రైతు మేళాకు రైతులు విశేషంగా తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ... ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ మంత్రి వర్గం రైతుల అవసరాలు, వ్యవసాయ రంగ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక శ్రద్ధతో పనిచేస్తోందన్నారు. విత్తనం వేసినప్పటి నుంచి పంట కొనుగోలు వరకు ప్రతి దశలో రైతులకు ప్రభుత్వం అండగా ఉంటోందని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వేల కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నామని తెలిపారు. రైతు సంక్షేమంపై ప్రతిపక్షాలు అనవసర విమర్శలు చేస్తున్నాయని, తమ ప్రభుత్వం మాటలకు పరిమి తం కాకుండా చేతల్లో చూపించే ప్రభుత్వమని అన్నారు. దశాబ్దాల క్రితం కాంగ్రెస్ ప్రభుత్వాలు నిర్మించిన నాగార్జున సాగర్, శ్రీరాం సాగర్, కడెం వంటి సాగునీటి ప్రాజెక్టులు నేటికీ రైతులకు నీరందిస్తున్నాయని, గత ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం కుంగిపోవడం ఆ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని విమర్శించారు. ఖమ్మం జిల్లాలో ప్రతి కుటుంబానికి వ్యవసాయంతో అనుబంధం ఉందని, అందుకే ఇక్కడ రైతు ఆశీర్వాద సభ నిర్వహిస్తున్నామని తెలిపారు.

ఆధునిక సాగు పద్ధతులు, ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు దృష్టి సారించాలని సూచించారు. వ్యవసాయంతో పాటు ఫిషరీస్, హార్టికల్చర్ తదితర అనుబంధ రంగాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని డిప్యూటీ సీఎం తెలిపారు.

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడు తూ... ఖమ్మం జిల్లాలో జూన్ 30న నిర్వహించా ల్సిన రైతు ఆశీర్వాద సభ వర్షాల కారణంగా జూలై 10వ తేదీకి వాయిదా పడిందన్నారు. తెలంగాణ చరిత్రలోనే అతిపెద్ద రైతు సభను చింతకాని మండలంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు సకాలంలో కురవడం లేదని, ఈ ఏడాది నీటి సమస్యలు తలెత్తే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు ఎలా వ్యవసాయం చేయాలనే అంశాలపై వ్యవసాయ శాఖ శాస్త్రీయ సూచనలు అందిస్తోందన్నారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వైరా ప్రాజెక్టుకు గోదావరి జలాలు అందించాలని చేసిన విజ్ఞప్తికి డిప్యూటీ సీఎం సానుకూలంగా స్పందించారని తెలిపారు. సీతారామ ఎత్తిపోతల పథకాన్ని వినియోగించుకుం టూ రాజీవ్ లింక్ కెనాల్ ద్వారా గోదావరి జలాల ను వైరా ప్రాజెక్టుకు తరలిస్తున్నామని, దీంతో వర్షా లతో సంబంధం లేకుండా దాదాపు లక్ష ఎకరాలకు సాగునీరు అందుతుందని చెప్పారు. తక్కువ కాలంలో, తక్కువ నీటితో పండే పంటలను రైతులు సాగు చేయాలని సూచించారు. ఉద్యమాలు, పోరాటాలు, వ్యవసాయ రంగంలో ఖమ్మం జిల్లాకు ఘన చరిత్ర ఉందని, జిల్లాలో అత్యధికంగా ఆయిల్ పామ్ సాగు జరుగుతోందన్నారు. సంప్రదాయ పంటలతోపాటు ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు దృష్టి సారించాలని, అధిక ఆదాయం వచ్చే పంటలను సాగు చేయాలని సూచించారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల ద్వారా వచ్చే వేతనం కంటే ఆయిల్‌పామ్ సాగుతో అధిక ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం, ప్రకృతి సహకరించకపోయినా రైతు సంక్షేమమే లక్ష్యంగా ముఖ్య మంత్రి, ఉప ముఖ్యమంత్రి అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నారని తెలిపారు.

వ్యవసాయ శాఖ సంచాలకులు గోపి మాట్లాడు తూ... వ్యవసాయం, అనుబంధ రంగాల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలను రైతులకు వివరించేందుకు ఈ మెగా రైతు మేళా నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ... మెగా రైతు మేళా కోసం మొత్తం 150 స్టాల్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వ్యవసాయ శాఖతో పాటు హార్టికల్చర్, ఫిషరీస్, పశుసంవర్ధక శాఖలు సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ... ఈ నెల 10వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఖమ్మం జిల్లాకు విచ్చేయనున్నారని, 'రైతు ఆశీర్వాదం' పేరుతో మూడు లక్షల మంది రైతులతో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు పేర్కొంటూ, రైతులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర హస్తక ళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్య నారాయణ, జిల్లా వ్యవసాయ అధికారి, ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నోట్‌బుక్స్,పెన్నుల పంపిణీ

**బోడుప్పల్:(పీపుల్స్ డైరీ) :** మేడిపల్లి కమలానగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మేడిపల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ రాజోజు నరసింహా చారి విద్యార్థులకు నోట్‌బుక్స్,పెన్నుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిస్ట్రిక్ట్ 320ఖీ,రీజియన్6,జోనల్ చైర్‌పర్సన్ లయన్ వేముల నాదం గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు నోట్‌బుక్స్,పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని,సమాజానికి ఆదర్శప్రాయులుగా ఎదగాలని ఆకాంక్షించారు. లయన్స్ క్లబ్ సమాజ సేవకు ఎల్లప్పుడూ అంకితభావంతో పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి లయన్ మేకల మల్లేశం,లయన్ లావణ్య సోమేశ్వర్,సావిత్రి,దుర్గ,పల్లె బాలరాజు,కోశాధికారి మహేందర్ రావు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, కాలనీవాసులు లయన్స్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




# నేడు భారీ రైతు ఆశీర్వాద సభ

## రైతు భరోసా, ఆశీర్వాద సభ ఏర్పాట్లపై మీడియా సమావేశం నిర్వహించిన డిప్యూటీ సీఎం



3 లక్షల మంది రైతులు హాజరవుతారని అంచనా

సభకు ప్రతి రైతు హాజరై ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని పిలుపు

9 రోజుల్లోనే రైతుల ఖాతాల్లో రూ.9 వేల కోట్ల రైతు భరోసా నిధులు జమ

వ్యవసాయ, అనుబంధ రంగాల కోసం 1,67,877 కోట్లు వ్యయం

**ఖమ్మం, జూలై 9 (పీపుల్స్ డైరీ) :** జూలై 10న ఖమ్మం జిల్లా చింతకాని మండలం జగన్నాథపురం గ్రామం మత్కేపల్లి క్రాస్ రోడ్డు వద్ద నిర్వహించే రైతు ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. గురువారం చింతకాని మండలం లచ్చగూడెం గ్రామంలో డిప్యూటీ సీఎం, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్‌తో కలిసి రైతు భరోసా ఆశీర్వాద సభపై మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు మాట్లాడు తూ... వానాకాలం పంట సీజన్‌కు సంబంధించి రైతుల ఖాతాల్లో రూ.9 వేల కోట్ల రైతు భరోసా పెట్టుబడి సహాయాన్ని అందించిన నేపథ్యంలో జూలై 10న రైతు ఆశీర్వాద సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర మంత్రివర్గ సభ్యులు, ప్రజాప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు 3 లక్షల మంది రైతులు ఈ సభకు హాజరవుతారని అంచనా వేస్తు న్నామని తెలిపారు. ప్రతి రైతు ఈ కార్యక్రమానికి విచ్చేసి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. రైతులే రాష్ట్రానికి వెన్నెముక అని, రైతులకు ప్రతి అడుగులో అండగా నిలవడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తోందని చెప్పారు. గత ప్రభుత్వం రైతు భరోసా పథకం క్రింద పదేళ్లలో మొత్తం రూ. 72 వేల కోట్లు మాత్రమే అందించిందని, తమ ప్రభుత్వం కేవలం రెండున్నరేళ్లలోనే రైతు భరోసా క్రింద రూ. 35,830 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేసిందని తెలిపారు. వ్యవసాయ, అనుబంధ రంగాల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఇప్పటివరకు ఒక లక్ష 67 వేల 877 కోట్లను వెచ్చించిందన్నారు. రైతు రుణమాఫీ, ధాన్యానికి బోనస్, పంటల బీమా, పంట నష్టపరిహారం, ఉచిత విద్యుత్, విద్యుత్ సబ్సిడీ, వ్యవసాయ యాంత్రీకరణ వంటి పలు రైతు సంక్షేమ కార్యక్రమాల అమలుకు ఈ నిధులను వినియోగించినట్లు వివరించారు. కేవలం తొమ్మిది రోజుల్లోనే రైతుల ఖాతాల్లో రూ. 9 వేల కోట్ల పెట్టుబడి సహాయాన్ని అందిస్తున్నామని వెల్లడించారు. ఖమ్మం జిల్లా అంటేనే వ్యవసాయానికి ప్రతీక అని, నాగార్జునసాగర్ వంటి ప్రధాన సాగునీటి ప్రాజెక్టులతో ఈ ప్రాంతం వ్యవసాయాభివృద్ధిలో ముందంజలో ఉందన్నారు. రైతుల సంక్షేమంపై ప్రభుత్వానికి పూర్తి స్పష్టత ఉందని, భవిష్యత్తులో రైతులకు మరింత మేలు చేసే కార్యక్రమాలను అమలు చేస్తామని, రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమన్నారు. ముఖ్యమంత్రి పాల్గొనే రైతు ఆశీర్వాద సభను విజయవంతం చేయడంలో మీడియా ప్రతినిధులు కూడా భాగస్వాములు కావాలని, కార్యక్రమానికి విస్తృత ప్రచారం కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో సంబంధిత అధికారులు, తదితరులున్నారు.

## సీఎం పర్యటన నేపథ్యంలో ఖమ్మం--బోనకల్ మార్గంలో ట్రాఫిక్ ఆంక్షలు

**ఖమ్మం, జూలై 09 (పీపుల్స్ డైరీ) :** రాష్ట్ర ముఖ్యమంత్రి శుక్రవారం ఖమ్మం జిల్లా చింతకాని మండలం జగన్నాథపురం మత్కేపల్లి క్రాస్ రోడ్డు వద్ద నిర్వహించనున్న రైతు ఆశీర్వాద సభ నేపథ్యంలో ఖమ్మం-- బోనకల్ ప్రధాన రహదారిపై ప్రత్యేక ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేస్తున్నట్లు పోలీస్ కమీషనర్ సునీల్ దత్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ఖమ్మం జిల్లా చింతకాని మండలం, మత్కేపల్లి క్రాస్ రోడ్, జగన్నాథపురంలో జరిగే రైతు ఆశీర్వాద సభకు వచ్చే రైతులు, ప్రజలు, అధికారులు, మీడియా, తదితర వాహనాలు మినహా ఖమ్మం నుండి బోనకల్ కు సాధారణ వాహనాల రాకపోకలు నిలిపివేయడం జరుగుతుందని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. ట్రాఫిక్ రద్దీ ని దృష్టిలో పెట్టుకొని ఉదయం 6:00 గంటల నుండి రాత్రి 12:00 గంటల వరకు ఆంక్షలు అమలులో వుంటాయని, ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాలు వెళ్లాలని సూచించారు. ఖమ్మం నుంచి వయా పందిళ్లపల్లి, చింతకాని, బోనకల్, ఆంధ్రకు వెళ్లే వాహనాలు నేలకొండపల్లి మీదుగా వెళ్లాలని, అదేవిధంగా బోనకల్లు నుంచి ఖమ్మం వైపు వచ్చే వాహనాలు వైరా మీదుగా రావాలన్నారు. ధంసలాపురం ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకు దగ్గర నుంచి బోనకల్ బ్రిడ్జి వరకు సాధారణ వాహనాల రాకపోకలు అనుమతించబడదన్నారు. హైదరాబాదు నుంచి మీటింగ్ కి వచ్చే విఐపి వాహనాలు కోదాడ, నేలకొండపల్లి, ముదిగొండ లోని వల్లపురం నుంచి మీటింగ్ స్థలం కి త్వరగా చేరుకోవచ్చు.

### రూట్ నెం - 1

**(పార్కింగ్ నెం.1 నుండి 5 వరకు)**

క్రింది మండలాల నుండి వచ్చే ప్రజలు రూట్ నెం.1 ద్వారా వచ్చి వారికీ కేటాయించిన పార్కింగ్ ప్రదేశాల్లో వాహనాలు నిలిపివేయాలి.

ఖమ్మం (టౌన్, రూరల్)
కామేపల్లి,
నేలకొండపల్లి,
ముదిగొండ
కామేపల్లి,
సింగరేణి,
తిరుమలాయపాలెం

### రూట్ నెం - 2

**(పార్కింగ్ నెం. 7, 8, 15)**

క్రింది మండలాల నుండి వచ్చే ప్రజలు రూట్ నెం. 2 ద్వారా రావాలి.
చింతకాని, వైరా, ఏన్కూరు, దమ్మపేట, కల్లూరు, పెనుబల్లి, సత్తుపల్లి, వేంసూరు, చంద్రుగొండ.

### రూట్ నెం - 3

**(పార్కింగ్ నెం. 10, 11, 12, 13, 14)**

క్రింది మండలాల నుండి వచ్చే ప్రజలు రూట్ నెం.3 ద్వారా రావాలి.
మధిర, ఎర్రుపాలెం, బోనకల్..

## రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్ట భద్రత...

### పోలీసులు విధుల్లో అప్రమత్తంగా ఉండాలి - భద్రతా విధులపై దిశానిర్దేశం చేసిన పోలీస్ కమిషనర్





**ఖమ్మం, జూలై 9 (పీపుల్స్ డైరీ) :** రాష్ట్ర ముఖ్యమంత్రి ఖమ్మం జిల్లా, చింతకాని మండలం, జగన్నాథపురంలో ఏర్పాటు చేసిన రైతు ఆశీర్వాద సభకు విచ్చేయనున్న నేపథ్యంలో పర్యటనకు సంబంధించి బందోబస్తు విధుల్లో పాల్గొనే పోలీసు అధికారులు, సిబ్బందితో సమావేశమైన పోలీస్ కమిషనర్ సునీల్ దత్ భద్రతా ఏర్పాట్లు, విధుల నిర్వహణ, సమన్వయంపై సమగ్ర దిశానిర్దేశం చేశారు. బందోబస్తు విధుల్లో పాల్గొనే పోలీసు అధికారులకు, సిబ్బందికి సభ వేదిక సమీపంలో ప్రత్యేక బ్రీఫింగ్ కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ... సభా ప్రాంగణం మొదలు, హెలిప్యాడ్, వాహన పార్కింగ్ ప్రాంతాలు ఇతర కీలక ప్రాంతాల్లో చేపట్టిన భద్రతా ఏర్పాట్లను పోలీస్ అధికారులతో సమీక్షించారు. ముఖ్యమంత్రి పర్యటన భద్రతా ఏర్పాట్లలో భాగంగా సుమారు 1500 మంది పోలీసు అధికారులు, సిబ్బందిని బందోబస్త్ విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపా రు. కేటాయించిన బాధ్యతలు సమర్థవంతంగా నిర్వర్తిం చాలని సూచించారు. భద్రతా ఏర్పాట్లలో ఎలాంటి లోపాలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పర్యటనను విజయవంతం చేయాలని, విధుల్లో ఉన్న పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా విధులు నిర్వర్తించాలని సీపీ సూచించా రు. పోలీసు అధికారులకు విధి నిర్వహణలో పాటించా ల్సిన భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, ప్రజలతో మర్యాదపూర్వక వ్యవహారం, వీఐపీ భద్రత తదితర అంశాలపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ రామానుజం, ఏసీపీ లు సారంగపాణి, తిరుపతి రెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు.

## రైతు ఆశీర్వాద సభకు భారీగా తరలిరండి

### వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్

**ఏన్కూరు జూలై 9 (పీపుల్స్ డైరీ) :** చింతకాని మండలం జగన్నాథపురం లో నేడు (శుక్రవారం)ముఖ్యమంత్రి హాజరవుతున్న రైతు ఆశీర్వాద సభకు భారీగా రైతులు తరలిరావాలని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ కోరారు. గురువారం ఏన్కూర్ లో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ,రైతు భరోసా కింద 9 రోజుల్లో 9 వేల కోట్ల రూపాయల నిధులను విజయవంతంగా విడుదల చేయడం జరిగిందన్నారు .ఇది కాంగ్రెస్ ప్రభుత్వ ఘనత అని అన్నారు .ఈ ప్రభుత్వం చిత్తశుద్ధితో, సంకల్పబలంతో వ్యవసాయరంగం బలోపేతానికి విశేష కృషి చేస్తుందన్నారు. ఈ రైతు ఆశీర్వాద సభకు ముఖ్యమంత్రి ,ఉప ముఖ్యమంత్రి ,జిల్లా మంత్రులు ,ఎమ్మెల్యేలు హాజరవుతున్నారని ఈ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు. ఈ సమావేశంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **KONDAPARTHI KIRAN,** PRINTED AT RATNA GRAPHICS, 2-3-703/7, THIRUMALA NAGAR COLONY, OPP : POLICE LINE, AMBERPET, HYDERABAD, TELANGANA - 500013, PUBLISHED AT H.NO. 3-4-396, NEW RAYAPURA, HANAMKONDA, WARANGAL, TELANGANA - 506001.
**EDITOR : KONDAPARTHI KIRAN.RNI NO: TEL/TEL/2009/28544, CELL:9493019044,** e-mail : peoplesdairydaily@gmail.com